thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

ఢిల్లీలో తొలిసారి ఫెన్సింగ్ ఆసియా కప్..



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 81 | జగిత్యాల | బుధవారం | 17 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |



## కేవలం ఐడీ ప్రూఫ్ మాత్రమే!

- ఆధార్ కార్డు దుర్వినియోగంపై సుప్రీం కోర్టు కీలక విచారణ
- కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

4




## నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

4

టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు

నీట్ రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

## జీ7 వేదికపై మోదీ-ట్రంప్ భేటీ

- 16 నెలల తర్వాత ముఖాముఖి సమావేశం
- భారత్-అమెరికా వాణిజ్య, వ్యూహాత్మక అంశాలపై చర్చ
- గ్లోబల్ సౌత్ స్వరాన్ని వినిపించిన ప్రధాని మోదీ

ఫ్రాన్స్‌లోని ఎవియన్-లెస్-బైన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అయ్యారు. దాదాపు 16 నెలల తర్వాత ఇరువురు నేతలు ముఖాముఖిగా కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. సదస్సు ప్రాంగణంలో పరస్పరం పలకరించుకున్న మోదీ, ట్రంప్ షేక్‌హ్యాండ్ ఇచ్చుకుని ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

4




# సన్న వడ్లతో రైతులకు ఆదాయం

## అదే మా లక్ష్యం

- రైతు వేదికల్లోనే విత్తనాలు అందుబాటులో ఉంచాలి
- వ్యవసాయంలో ఏఐ, సాంకేతికత వినియోగం మరింత పెరగాలి
- విత్తనం నుంచి కొనుగోలు వరకు సమన్వయంతో పనిచేయాలి
- సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 16:** రాష్ట్రంలో ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణమైన అవగాహన ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక వరిరకాల విత్తనాలను నేరుగా క్షేత్రస్థాయిలోని రైతు వేదికల్లోనే అందుబాటులో ఉంచాలని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా సన్నవడ్లు పండించే రైతుల పూర్తి డేటాను సేకరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

మిగతా 2 లో



రాష్ట్ర రైతులకు అధిక లాభాలు చేకూర్చేలా సన్నరకం వరి సాగును ప్రోత్సహిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బోనస్ అందించే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచాలని, వాటిని సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. సన్న వడ్లు సాగు చేసే రైతుల పూర్తి వివరాలను సేకరించి ప్రత్యేక డేటాబేస్ రూపొందించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన వ్యవసాయ శాఖ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడుతూ, ధాన్యం దిగుబడులు, సాగు విస్తీర్ణం, మార్కెట్ అవసరాలపై వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. విత్తనాల సరఫరా నుంచి ధాన్యం కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



## నిధులు వెంటనే ఇప్పించండి!

- రైల్వే మంత్రితో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలి
- ముందస్తు షరతులు పూర్తి చేసినా ఆగిన ఐఆర్‌ఎఫ్సీ రుణం
- ఏవైనా సందేహాలుంటే స్వయంగా కలిసి వివరిస్తా
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి బహిరంగ లేఖ
- మెట్రో రెండో దశ విస్తరణ ప్రాజెక్టుపై లేఖలో వివరణ
- కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి చొరవ చూపాలి

.. వివరాలు 2లో



## ఇంట్లో రూ. 1.5 కోట్లు.. కేజీ బంగారం

- ఏసీబీ వలలో అవినీతి తిమింగలం!
- ల్యాండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో సోదాలు

3

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అరెస్ట్ చేసింది. నరహరి ఇంటితో పాటు మరో 9 చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిపారు.



## అలుసుగా తీసుకుంటే ఖబర్దార్

- అన్నలంతా మా పార్టీలోనే ఉన్నారు!
- సింగరేణి యాజమాన్యానికి కవిత హెచ్చరిక
- మంచిర్యాలలో ఆర్కే 7 గని వద్ద ఉద్రిక్తత
- కాంగ్రెస్ సర్కారుపై ప్రశ్నల వర్షం

3



## రేవంత్‌వి స్కాములే!

- ముమ్మాటికీ ఆయన ఎగవేతల ముఖ్యమంత్రే
- హరీశ్ రావు ధ్వజం

.. వివరాలు 3లో

## ఈసీ కమలం తొత్తు!

బెంగాల్‌లో 92 లక్షల ఓట్ల తొలగింపే నిదర్శనం

ఉప ముఖ్యమంత్రి పవన్ వెనుక ఉన్నది ఆ పార్టీయే

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



2

## 19 నుంచి భారీ వర్షాలు!



వారం రోజుల పాటు విస్తారంగా వానలు

2

## రేవంత్ సర్టిఫికెట్ మాకక్కర్లేదు!

- మాకు పాఠాలు అవసరం లేదు
- మెట్రోకు కేంద్రం పూర్తి అండ
- ఆపే సంస్కృతి కాంగ్రెస్‌దే!
- సీఎం వ్యాఖ్యలు అనాలోచితం
- రేవంత్‌పై కిషన్ రెడ్డి ఫైర్



3

## గోవా నుంచి డ్రగ్స్ దందా!

- మత్తు ముఠాపై ఈగిల్ ఫోర్స్ దాడి!
- 14 మందికి గంజాయి పాజిటివ్‌గా నిర్ధారణ



EAGLE FORCE

రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ వినియోగంపై భారీగా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈగిల్ ఫోర్స్ రంగంలోకి దిగింది. మంగళవారం పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి 19 మందిని అదుపులోకి తీసుకుంది. గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టును ఈ దాడుల ద్వారా అధికారులు రట్టు చేశారు. పట్టుబడిన వారందరినీ డీ అడిక్షన్ కేంద్రాలకు తరలించారు.

3




# నా మానస పుత్రిక!

**నేడు ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం**

**సామాజిక మాధ్యమంలో ముఖ్యమంత్రి రేవంత్ ఉద్వేగం**

**రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో 100 స్కూళ్ల ఏర్పాటు**

**హైదరాబాద్, జూన్ 16:** చరిత్ర పుటల్లో కలిసిపోతున్న సర్కారు బడులకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేలా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'ను బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ పాఠశాల తన మానస పుత్రిక అని, విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దే సకల హంగులతో దీన్ని రూపుదిద్దామని ఆయన స్పష్టం చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి 100 పాఠశాలలను నెలకొల్పడమే తమ తదుపరి కర్తవ్యమని ప్రకటించారు. ఆరుట్లలో నూతనంగా నిర్మించిన పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. భారతదేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందన్నది ఇకపై ఒక నినాదం మాత్రమే కాదని, కళ్ల ముందు కనిపించే నిజమని వ్యాఖ్యానించారు. ఆ నిజానికి ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూలే సజీవ సాక్ష్యమన్నారు. మేధావుల సలహాలు, విజ్ఞుల సూచనలతో తెలంగాణ విద్యా వ్యవస్థ చరిత్రను విప్లవాత్మక సంస్కరణలతో తిరిగి రాయాలన్న తన సంకల్పానికి రూపమే ఈ పాఠశాల అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సర్కారు బడి ప్రజా పాలనలో మళ్లీ పూర్వ వైభవాన్ని మించిన వైభవంతో, సకల సౌకర్యాలు, ఆధునిక వసతులతో పిల్లల మేధో వికాస కేంద్రంగా నిలబడబోతోందని ఆకాంక్షించారు. తెలంగాణ బిడ్డల పాలిట సరస్వతీ కటాక్ష ఆలయంగా ఇది రూపుదిద్దుకుందని సంతోషం వ్యక్తం చేశారు. ఆకలి తీర్చి, అక్షరాలు నేర్పి, ఆటను ప్రోత్సహించి పిల్లల్లో మనోవికాసం వికసించేలా పాఠశాలను నిర్మించామన్నారు. మట్టిలో మాణిక్యాలను తీర్చిదిద్దే కార్యంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఆరుట్లలో ఆవిష్కృతమవుతున్న పబ్లిక్ స్కూల్ విద్యారంగంలో ఒక సరికొత్త ఆరంభం మాత్రమేనని, రాష్ట్రవ్యాప్తంగా రాబోయే రోజుల్లో 100 పాఠశాలలను నిర్మించడమే తమ ప్రధాన లక్ష్యమని రేవంత్ స్పష్టం చేశారు.

# జర్నలిస్ట్ కుటుంబాలకు నేడు సాయం

**హైదరాబాద్, జూన్ 16:** మరణించిన వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు, అనారోగ్యం బారిన పడిన/ప్రమాదాలకు గురైన జర్నలిస్టులకు బుధవారం ఆర్థిక సహాయం అందించనున్నారు. బుధవారం ఉదయం 10:45 గంటలకు నాంపల్లి తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై చెక్కులను అందజేస్తారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ మరియు నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పాల్గొంటున్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

# కాంట్రాక్టర్లకు సర్కారు అండ!

**దశలవారీగా పెండింగ్ బిల్లుల చెల్లింపు**

**స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హామీతో 18న జరగాల్సిన చలో హైదరాబాద్ వాయిదా**

**హైదరాబాద్:** రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఆయనను కలిశారు. పెండింగ్ బకాయిలు దశలవారీగా చెల్లిస్తామని భట్టి హామీ ఇవ్వడంతో.. ఈ నెల 18న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్లు కాంట్రాక్టర్లు ప్రకటించారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఆర్థిక శాఖ ప్రతి నెలా నిరంతరాయంగా బిల్లులను చెల్లిస్తోందని భట్టి విక్రమార్క వారికి గుర్తుచేశారు. పెండింగ్ బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని వివరించారు. రాష్ట్రంలో చిన్న కాంట్రాక్టర్లకు దశలవారీగా పెండింగ్ బిల్లులన్నింటినీ పూర్తిగా చెల్లించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కాంట్రాక్టర్ల ప్రతినిధులు చర్చలు జరిపారు. అనంతరం ప్రజాభవన్‌కు చేరుకుని, మంత్రి కోమటిరెడ్డితో జరిగిన చర్చల సారాంశాన్ని భట్టి విక్రమార్కకు వివరించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన సానుకూల హామీతో తాము సంతృప్తి చెందామని బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రవీందర్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ నెల 18న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్లు ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు అసోసియేషన్ తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సత్యమూర్తి, మాజీ జాతీయ అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు డీవీఎన్ రెడ్డి, సుగుణాకర్ రావు, భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్, శ్యామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సన్న వడ్లతో రైతులకు అధిక ఆదాయం

## అదే మా లక్ష్యం

- రైతు వేదికల్లోనే విత్తనాలు అందుబాటులో ఉంచాలి
- వ్యవసాయంలో ఏఐ, సాంకేతికత వినియోగం మరింత పెరగాలి
- విత్తనం నుంచి కొనుగోలు వరకు సమన్వయంతో పనిచేయాలి
- సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 16:** ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశిరచారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నిధులు వెంటనే ఇప్పించండి!

- రైల్వే మంత్రితో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలి
- ముందస్తు షరతులు పూర్తి చేసినా ఆగిన ఐఆర్ఎఫ్సీ రుణం
- ఏవైనా సందేహాలుంటే స్వయంగా కలిసి వివరిస్తా
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ బహిరంగ లేఖ
- మెట్రో రెండో దశ విస్తరణ ప్రాజెక్టుపై లేఖలో సమగ్ర వివరణ



**హైదరాబాద్, జూన్ 16:** హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ చేపట్టడానికి, మొదటి దశ స్వాధీనం కోసం తెలంగాణ ప్రభుత్వం ముందస్తు షరతులన్నింటినీ పూర్తి చేసిన నేపథ్యంలో కేంద్రం తక్షణమే స్పందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఒప్పంద నిబంధనల మేరకు మంజూరైన నిధులను ఐఆర్ఎఫ్సీ నుంచి వెంటనే విడుదల చేయించేలా చూడాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ అంశాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. మెట్రో స్వాధీనం కోసం అమలులో ఉన్న ఆర్థిక ఒప్పందాల ప్రకారం ఐఆర్ఎఫ్సీ అంగీకరించిన మేరకు తొలి విడత రుణాన్ని 2026 జూన్ 15వ తేదీన విడుదల చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు షరతులను పూర్తి చేయడమే కాకుండా ఐఆర్ఎఫ్సీ కోరిన మేరకు ముందస్తు రుసుముగా 84.32 కోట్లు చెల్లించినట్టు ఆ లేఖలో వివరించారు. ఒప్పంద ప్రక్రియ మేరకు అన్నింటినీ పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఐఆర్ఎఫ్సీ నుంచి నిధులు విడుదల కాలేదని కిషన్ రెడ్డి దృష్టికి తెచ్చారు.

**స్వయంగా కలిసి వివరిస్తా..**

మెట్రో స్వాధీన ప్రక్రియ, సంతకాలు చేసిన ఒప్పందం లేదా ప్రతిపాదిత హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి ఇంకా ఏవైనా సమాచారం కావలసినా, వివరణలు అవసరమైనా సంబంధిత అధికారులతో కలిసి అనుకూలమైన సమయం, ప్రదేశంలో వ్యక్తిగతంగా కలిసి అన్ని వివరాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఐఆర్ఎఫ్సీ మంజూరు చేసిన రుణం మరింత జాప్యం జరగకుండా వెంటనే విడుదల చేయించడంతో పాటు రెండో దశ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను వీలైనంత తొందరగా మంజూరు చేయాలని కోరారు.

**సమావేశం ఏర్పాటు చేయండి..**

అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ అంశం పరిష్కారానికి సంబంధించి జరిగే ఏ సమావేశానికైనా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో వీలైనంత త్వరగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆ సమావేశానికి తాను సంబంధిత ఒప్పందాలు, ఆధార పత్రాలతో హాజరై ఏవైనా సందేహాలు, సమస్యలను నివృత్తి చేసి, ఈ అంశాన్ని త్వరితగతిన పరిష్కరించేలా సహకరిస్తానని స్పష్టం చేశారు.

**38,595 కోట్లతో రెండో దశ..**

మెట్రో మొదటి దశ అంశాలతో పాటు రెండో దశలో భాగంగా నగరంలో 7 కారిడార్లను కవర్ చేస్తూ దాదాపు 38,595 కోట్ల అంచనా వ్యయంతో 122.9 కిలోమీటర్ల మేరకు విస్తరణ చేపట్టాల్సిన వివరాలను ముఖ్యమంత్రి తన లేఖలో సమగ్రంగా తెలిపారు. ఎంతో కీలకమైన ఈ అంశం పరిష్కారానికి రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేస్తారని ఆశిస్తూ, కిషన్ రెడ్డి నుంచి వచ్చే సమాచారం కోసం ఎదురుచూస్తుంటానని ముఖ్యమంత్రి ఆ లేఖలో పేర్కొన్నారు.

# 19 నుంచి భారీ వర్షాలు!

**రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు**

**వారం రోజుల పాటు విస్తారంగా వానలు**

**హైదరాబాద్, జూన్ 16:** ఎండల వేడితో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. జూన్ 19వ తేదీ నుంచి రాష్ట్రంలో వారం రోజుల పాటు విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు అప్రమత్తత చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే వారం రోజుల పాటు కురవనున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు.



# ఎన్నికల సంఘం కమలం తొత్తు!

**బెంగాల్‌లో 92 లక్షల ఓట్ల తొలగింపే నిదర్శనం**

**ఆ ప్రక్రియంతా కేవలం అధికార పార్టీకి లాభం చేకూర్చేందుకే**

**ఉప ముఖ్యమంత్రి పవన్ వెనుక ఉన్నది ఆ పార్టీయే**

**బూత్ స్థాయి ఏజెంట్ల సభలో మహేష్ కుమార్ గౌడ్ ఫైర్**

**సంగారెడ్డి:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో కేంద్ర ఎన్నికల సంఘం అధికార పార్టీకి తొత్తుగా మారిందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. కేవలం వాళ్లకు లాభం చేకూర్చేలా ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియ సాగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. సంగారెడ్డిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సభలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల సవరణ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే రాష్ట్రంలో మంత్రి దామోదర రాజనర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో పాటు తన ఓటు గల్లంతైనా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2002లో ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, కానీ ప్రస్తుతం ఓట్లు పడవనుకుంటే వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బూత్ స్థాయి ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాల్సి ఉంటుందని దిశానిర్దేశం చేశారు. అతికొద్ది మంది నిజాయితీపరుల్లో ఒకరైన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని అకారణంగా తిరస్కరించారని గుర్తుచేశారు. నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల్లా వెలుగొందాలని ఢిల్లీ పెద్దలు అనుకుంటున్నారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. అంతకంటే పెద్ద చక్రవర్తులే నేలమట్టం అయ్యారని, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఎంత అని ఆయన ప్రశ్నించారు. అధికారం శాశ్వతం అనుకుంటే వాళ్లు మూర్ఖులే అవుతారన్నారు. దేవుళ్లకు ఎవరూ వ్యతిరేకం కాదని, కానీ దేవుడి పేరు చెప్పనిదే ఆ పార్టీకి ఓట్లు పడవని ఎద్దేవా చేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతున్నారంటూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వెనుక జాతీయ అధికార పార్టీ ఉందని పీసీసీ చీఫ్ ఆరోపించారు. ఆ పార్టీ ఆడించినట్లే ఆయన ఆడుతున్నారని విమర్శించారు. పవన్ సానుభూతి తమకేమీ అవసరం లేదని, ఆయన కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణ వచ్చినప్పుడు 10 రోజులు అన్నం తినలేదని పవన్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో చిట్టా విప్పాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. విభజన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదని, కేంద్రం నుంచి రాష్ట్రానికి ఇంకా భారీగా నిధులు రావాల్సి ఉందన్నారు. మీరు సబర్మతి రివర్ ఫ్రంట్ కట్టుకోవచ్చు కానీ, తాము మూసీ ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరా అని ఆయన నిలదీశారు. దీనికి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు అక్కసు వెళ్లగక్కుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ సర్టిఫికెట్ మాకక్కర్లేదు!

- అభివృద్ధిపై పాఠాలు చెప్పాల్సిన పనిలేదు
- దొడ్డిదారిన ప్రాజెక్టులు ఆపే సంస్కృతి కాంగ్రెస్‌దే
- హైదరాబాద్ మెట్రోకు కేంద్రం పూర్తి సహకారం
- అనాలోచితంగా మాట్లాడటం సరికాదు
- సీఎం వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డ కిషన్ రెడ్డి



**ఢిల్లీ:** తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి విషయంలో తమకెవరూ పాఠాలు చెప్పాల్సిన పనిలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనాలోచితంగా, దుందుడుకు ధోరణితో మాట్లాడుతున్నారని, తెలంగాణ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న తమకు ఆయన సర్టిఫికెట్ అవసరం లేదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశవ్యాప్తంగా ఇతర నగరాల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కూడా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శల నేపథ్యంలో ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మెట్రో రైలు ప్రాజెక్టును ఆపాలని తాను ఎందుకు చెబుతానని అసహనం వ్యక్తం చేశారు. మెట్రోకు సంబంధించి కేంద్రం రాష్ట్రానికి కొన్ని మార్పులను మాత్రమే సూచించిందని గుర్తుచేశారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని, అది కాంగ్రెస్ నాయకులకే ఉండి ఉండొచ్చని చురకలంటించారు. తాము ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు. గతంలో మెట్రో మొదటి దశకు కేంద్రం 1,250 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, తాము రేవంత్ రెడ్డికి కాదు తెలంగాణ ప్రజలకు జవాబుదారీ అని స్పష్టం చేశారు. తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తాను పోరాటం చేశానని, ఢిల్లీలో రెండుసార్లు ధర్నా చేశానని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్ లో ఆమరణ దీక్ష విరమించానని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశామని, ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తున్నామని చెప్పారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్ కు, నేడు రేవంత్ కు లేఖలు రాశానని, వారు అడగకపోయినా కేంద్రమే బాధ్యతగా తీసుకుని పనులు చేపట్టిందని వివరించారు. ఎంఎంటీఎస్ రెండో దశకు గత ప్రభుత్వం సహకరించకపోయినా ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించామని, రాష్ట్రానికి రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించామని ఆయన వెల్లడించారు.

### లక్షల కోట్లు ఇస్తున్నాం..

రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను కేంద్రం ఇటీవల మంజూరు చేసిందని, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు తీసుకునే ఏడీబీ రుణానికి ఎన్వోసీ కూడా ఇచ్చిందని గుర్తుచేశారు. ఎన్సీడీసీ ద్వారా పదేళ్లలో తెలంగాణకు 1,00,000 కోట్ల రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల కోసం 37,000 కోట్ల రూపాయలు మంజూరు చేసి, ఇప్పటికే 34,000 కోట్ల రూపాయలు అందించామని వివరించారు. 1,75,000 కోట్ల రూపాయలతో రాష్ట్రంలో జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నామని, ప్రధాని మోదీ నిధులు ఇస్తుంటే తాను అడ్డుపడుతున్నానని ఆరోపించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గోవా నుంచి డ్రగ్స్ దందా!

- మత్తు ముఠాపై ఈగిల్ ఫోర్స్ దాడి!
- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో తనిఖీలు
- అదుపులో 19 మంది డ్రగ్స్ బాధితులు
- 14 మందికి గంజాయి పాజిటివ్‌గా నిర్ధారణ
- సినీ పరిశ్రమకు చెందిన పలువురికి లింకులు

**హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ వినియోగంపై భారీగా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈగిల్ ఫోర్స్ రంగంలోకి దిగింది. మంగళవారం పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి 19 మందిని అదుపులోకి తీసుకుంది. గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టును ఈ దాడుల ద్వారా అధికారులు రట్టు చేశారు. పట్టుబడిన వారందరినీ డీ అడిక్షన్ కేంద్రాలకు తరలించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్ నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈగిల్ ఫోర్స్ దాడులు నిర్వహించింది. మొత్తం 15 బృందాలు ఏకకాలంలో ఈ ఆపరేషన్ చేపట్టాయి. అదుపులోకి తీసుకున్న 19 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. వారిలో 14 మందికి గంజాయి పాజిటివ్, మరో వ్యక్తికి డ్రగ్స్ పాజిటివ్ నిర్ధారణ అయింది. పట్టుబడిన వారందరూ మత్తు పదార్థాలు వాడినట్లు విచారణలో అంగీకరించారని అధికారులు తెలిపారు. వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి డీ అడిక్షన్ సెంటర్లకు పంపించారు.

### సినీ ప్రముఖులకు లింకులు..

విచారణలో కీలక విషయాలు వెలుగుచూశాయి. గోవాలోని వాగటోర్ బీచ్‌ను కేంద్రంగా చేసుకుని ఓ ముఠా కొకైన్, ఎండిఎంఎ, ఎల్ఎస్డి, హ్యాష్ ఆయిల్ తదితర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని బెంగళూరు, గోవా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు కనుగొన్నారు. ముఖ్యంగా సినీ పరిశ్రమలోని పలువురికి వీటిని విక్రయించినట్లు దర్యాప్తులో తేలడం సంచలనంగా మారింది.

### ఖాతాల్లోకి నగదు బదిలీ..

సాంకేతిక విశ్లేషణ ద్వారా మొత్తం 44 మంది డ్రగ్స్ వినియోగదారులను ఈగిల్ ఫోర్స్ గుర్తించింది. వారు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవాలో ఉన్నట్లు విచారణలో బహిర్గతమైంది. మత్తు పదార్థాల కొనుగోలు కోసం కొందరు వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డిల బ్యాంక్ ఖాతాలకు 3.13 లక్షల రూపాయలకు పైగా నగదు బదిలీ చేసినట్లు అధికారులు ఆధారాలు సేకరించారు. కాగా, ఈ ఇద్దరు నిందితులు 2019లోనూ ఇదే తరహా ఎన్డీపీఎస్ కేసులో అరెస్టయినట్లు ఈగిల్ ఫోర్స్ బృందం వెల్లడించింది

# మూసాపేట గూడ్స్ షెడ్‌లో అగ్నిప్రమాదం

### 60 వాహనాలు దగ్ధం..భారీగా ఆస్తినష్టం



**హైదరాబాద్, జూన్ 16:** హైదరాబాద్‌లోని మూసాపేట్ గూడ్స్ షెడ్ ప్రాంతంలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఎలక్ట్రానిక్ వాహనాలు నిల్వ చేసే గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాం మొత్తం దట్టమైన పొగతో కమ్ముకుపోగా, మంటలు భారీగా ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఫైర్ సిబ్బంది ప్రయత్నించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ గోదాంలో ఎలక్ట్రానిక్ వాహనాలు నిల్వ ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. అదుపులోకి మంటలు.. కాసేపటి తర్వాత మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ఈ ప్రమాదంలో 60 ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే 8 నెలల నుంచి ఈ సర్వీస్ సెంటర్ గోదామును యాజమాన్యం మూసివేసింది.

# రేవంత్‌వి స్కాములే!

- ముమ్మాటికీ ఆయన ఎగవేతల ముఖ్యమంత్రే
- నాపై కేసులు పెట్టినా భయపడేది లేదు
- ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు



**కరీంనగర్:** తెలంగాణలో కేసీఆర్ హయాంలో ప్రజల కోసం స్కీములు అమలు చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు స్కాములకు పాల్పడుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనను ఎగవేతల రేవంత్ అన్నందుకు కేసులు పెట్టారని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ముమ్మాటికీ రేవంత్ ఎగవేతల ముఖ్యమంత్రేనని ఆయన పునరుద్ఘాటించారు. కేసీఆర్ లాంటి దార్శనికుడు మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని ఆయన స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా అలుగునూర్ లో మంగళవారం మానకొండూర్ నియోజకవర్గ స్థాయి డిజిటల్ సభ్యత్వ నమోదు, ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్) విస్తృత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మేనిఫెస్టోలో చెప్పకపోయినా గతంలో రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి లాంటి పథకాలను కేసీఆర్ అద్భుతంగా అమలు చేశారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు సివిల్ సప్లై, సింగరేణి, రహదారులు, పిల్లలకు పెట్టే గుడ్లు, బట్టల్లో పెద్ద ఎత్తున స్కాములు జరుగుతున్నాయని ఆరోపించారు. బీసీ, ఎస్సీ సంక్షేమ మంత్రులకు తెలియకుండానే 2,000 కోట్ల కుంభకోణం జరిగిందని, ఇది జిల్లా పరువు తీస్తోందని విమర్శించారు.

### కమీషన్ల కోసమే పనులు..

పథకాల అమలుకు ఖజానాలో డబ్బులు లేవంటున్న రేవంత్.. ఫుట్ బాల్ ఆటలకు, అందాల పోటీలకు, వాస్తు పేరుతో సచివాలయ పనులకు, క్యాంపు ఆఫీసులకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్లు రాని పేదల పథకాలను పక్కనపెట్టి, కమీషన్లు వచ్చే పనులను మాత్రమే సర్కారు చేపడుతోందని ఆరోపించారు. మన సొమ్మును ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలకు, ఎన్నికల కోసం ఢిల్లీకి పంపుతున్నారని విమర్శించారు. ఉపాధి కూలీలకు 12,000 ఇవ్వడం లేదని, దేవుడిని సైతం వంచించిన రేవంత్.. విద్యార్థులను, నిరుద్యోగులను, రైతులను దారుణంగా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. 2,00,000 ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,000 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో 30 లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.



# అలుసుగా తీసుకుంటే ఖబర్దార్

### అన్నలంతా మా పార్టీలోనే ఉన్నారు!

### సింగరేణి యాజమాన్యానికి కవిత హెచ్చరిక

**మంచిర్యాల:** తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తలపెట్టిన 'బొగ్గు బాయి' కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 భూగర్భ గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవిత, టీఆర్ఎస్ శ్రేణులను, కార్మిక సంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. గేట్లను తోసుకుని నాయకులు గని ఆవరణలోకి దూసుకెళ్లారు. కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని సింగరేణి యాజమాన్యాన్ని కవిత తీవ్రస్థాయిలో హెచ్చరించారు. బొగ్గు బాయి కార్యక్రమంలో తమను అడుగడుగునా సింగరేణి యాజమాన్యం అడ్డుకుంటోందని, కార్మికులతో కలిసి గేట్ మీటింగ్ పెట్టుకునే హక్కు తమకు ఉందని కవిత స్పష్టం చేశారు. గనుల్లో పనిచేసే కార్మికులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకుండా యాజమాన్యం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. కార్మికులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, అవసరమైతే న్యాయపరంగా ముందుకెళ్తామని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీరుపై కవిత పలు ప్రశ్నలు సంధించారు. గతంలో రాహుల్, రేవంత్, భట్టి సింగరేణిలో పర్యటించలేదా అని అడిగారు. తాము కార్మికుల సమస్యలు తెలుసుకుంటే తప్పేంటని నిలదీశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్ని రోజులు అధికారంలో ఉంటారని మండిపడ్డారు. సింగరేణి కార్మికుల సమస్యలపై టీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆమె ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా మావోయిస్టుల గురించి కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అడవిలో అన్నలు ఉన్నప్పుడు సింగరేణి అధికారులు పద్ధతిగా పని చేసేవారని, అప్పట్లో కార్మికులకు ఒక ధైర్యం ఉండేదని ఆమె గుర్తుచేశారు. ఇప్పుడు అడవిలో అన్నలు లేరని, తమను అడిగే దిక్కులేదని సింగరేణి యాజమాన్యం అనుకుంటోందని విమర్శించారు. కానీ, ఆ అన్నలందరూ ఇప్పుడు టీఆర్ఎస్ లోనే ఉన్నారని, కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే వెంటాడుతామని కవిత హెచ్చరించారు.

# ఇంట్లో రూ. 1.5 కోట్లు.. కేజీ బంగారం

### ల్యాండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో సోదాలు

### రంగారెడ్డి జిల్లాలో పనిచేసిన కాలంపైనా ఆరా

**హైదరాబాద్ :** ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే పక్కా సమాచారంతో ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ కొంకరి నరహరి ఇంట్లో ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం నుంచి విస్తృత తనిఖీలు చేపట్టారు. నగరంలోని ఆయన నివాసంతో పాటు బంధువులు, ఆప్తుల ఇళ్లలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో 1.5 కోట్ల నగదు, కేజీ బంగారం సహా భారీగా అక్రమాస్తులను గుర్తించారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, చార్మినార్ సహా మొత్తం 13 చోట్ల దాడులు కొనసాగుతున్నాయి. నరహరి తన అధికారిక ఆదాయానికి మించి భారీగా అక్రమ ఆస్తులను కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ ఈ చర్యలు చేపట్టింది. ఈ తనిఖీల్లో కీలకమైన భూమి పత్రాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, నగదు, బంగారు ఆభరణాలకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. సోదాల్లో భాగంగా భారీగా అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. విలువైన డాక్యుమెంట్లు, బంగారు ఆభరణాలతో పాటు రూ. 1.5 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నరహరితో పాటు ఆయన తమ్ముడి నివాసంలో సైతం ఏసీబీ బృందాలు సోదాలు కొనసాగిస్తున్నాయి. ఆయన ఇంట్లోనూ భారీగా ఆస్తులను అధికారులు గుర్తించారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలపై అన్నదమ్ముల నుంచి అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. సోదాలు పూర్తిగా ముగిసిన తర్వాత పట్టుబడిన అక్రమ ఆస్తుల పూర్తి వివరాలను, వాటి మార్కెట్ విలువను అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. ల్యాండ్ అండ్ సర్వే విభాగంలో మల్టీ జోన్ 2 డిప్యూటీ డైరెక్టర్‌గా నరహరి కీలక విధులు నిర్వహిస్తున్నారు. భూమి సర్వే, సరిహద్దు వివాదాల పరిష్కారం, భూమి స్వాధీనం వంటి ప్రధాన బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు. గతంలో రంగారెడ్డి జిల్లాకు ఏడీగా కూడా ఆయన పనిచేశారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో కూడా నరహరి భారీగా అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# చిన్నారులపై పెరుగుతున్న అఘాయిత్యాలు

### తెలంగాణలో 16శాతం ఫోక్సో కేసులు నమోదు

### ఆందోళన వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

**హైదరాబాద్, జూన్ 16:** రాష్ట్రంలో చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగాయి. ఆడ పిల్లల్ని కనాలంటే భయపడే పరిస్థితి రాష్ట్రంలో ఉందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ..మోదీ భేటీ బచావో భేటీ పడావో అంటారు. కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర హోం మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. ఫోక్సో కేసులు దేశంలో 6 శాతం నమోదు అయితే ఒక్క తెలంగాణలో 16శాతం ఫోక్సో కేసులు నమోదు అయ్యాయని విమర్శించారు. తెలంగాణలో క్రైమ్ రేట్ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఇప్పటి వరకు సమీక్ష చేయలదని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ సర్పంచ్ చిన్నారిపై దాడి చేస్తే పోలీసు వాళ్లు సెటిల్ మెంట్ చేశారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సీఎం అంటున్నారు. ముందు తెలంగాణలో చిన్నారులను కాపాడండి. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న దాడులు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీకి తెలియవా అని ప్రశ్నించారు. బండి భగీరథ్ కేసు విషయంలో తొలుత వీక్ సెక్షన్లు పెట్టారు. రాష్ట్రంలో మహిళలు రోడ్డు ఎక్కితే అప్పుడు సెక్షన్లు మార్చారని గుర్తు చేశారు. చిన్నారులపై అఘాయిత్యాలపై పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలిన డిమాండ్ చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మహిళలకు ధైర్యం ఉండేదన్నారు.



# ఎరువులు, విత్తనాలపై భరోసా ఏదీ?

## ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అన్నదాతల ఆందోళన

## నైరుతి ప్రవేశించినా వర్షాభావ పరిస్థితులు

### తొందరపడి విత్తనాలు వేయవద్దని అధికారుల హెచ్చరికలు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఇప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంపై రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. రైతులు ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం అవుతున్నా, అప్పుడే తొందరపడి విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తుండటం గమనార్హం. మ-రోవైపు దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న సన్నరకాల వంగడాలనే సాగు చేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా సూచించింది. నిజానికి ఏ భూములు ఏ పంటలకు అనుకూలమో ఇన్నేళ్లయినా గుర్తించడంలోనూ, రైతులకు ముందే సూచనలు అందించి అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను సకాలంలో సరఫరా చేయడంలోనూ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదవుతుందని భారత వాతావరణ శాఖ (×వీణ) అంచనా వేయడంతో పాటు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఒప్పుకుంటున్నా, అందుకు తగ్గ నిర్దిష్ట ప్రణాళికలు రైతులకు బోధపడటం లేదు. నీటి లభ్యత, భూసార వివరాల ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో పంటల ప్రణాళిక లేకపోవడంతో రైతులు తమకు తెలిసిన వరి పంటనే సాగు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. గత ఏడాది కూడా వర్షాభావం, అకాల భారీ వర్షాలు, మరియు తుఫాన్ల వల్ల అన్నదాతలు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూశారు. ఆంధ్రప్రదేశ్‌లో రబీ సీజన్ తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల మధ్య సాగడంతో ప్రభుత్వం 51 మండలాల్లో కరువు ప్రకటించి చేతులు దులుపుకుంది తప్ప బాధితులకు ఎలాంటి ప్రత్యేక సాయం అందించలేదు. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ పండించిన పంటలకు సరైన మద్దతు ధర ఇప్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టలేదు. తెలంగాణలో మక్కజొన్న, జొన్న పంటలు వేసిన రైతులు గిట్టుబాటు ధర లేక తల్లడిల్లగా, కొత్త ఖరీఫ్ ముంచుకొస్తున్నా నేటికీ ధాన్యం సేకరణ ప్రక్రియ సక్రమంగా పూర్తి కాలేదు.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సేద్యానికి అత్యవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మరియు పెట్టుబడుల సరఫరాపై తీవ్ర స్తబ్దత నెలకొంది. రైతులకు అవసరమైన మొత్తం విత్తనాల్లో ప్రభుత్వం రాయితీపై అందిస్తున్నవి కేవలం 30 శాతమే కాగా, అవి కూడా కొన్ని పంటలకే పరిమితమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో వేరుశనగ, వరి, కందులు వంటి విత్తనాల పంపిణీ ఏర్పాట్లు పూర్తిగా ఆలస్యమయ్యాయి. రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలకు కూడా బహిరంగ మార్కెట్ ధరలనే నిర్ణయించడం గమనార్హం. కేంద్రం ఆదేశాల నెపంతో యూరియా, డీఏపీ వాడకాన్ని తగ్గించేందుకు ప్రవేశపెట్టిన ప్రత్యేక యాప్‌లు, కార్డులు మరియు పైలట్ ప్రాజెక్టులు కౌలు రైతుల్లో తీవ్ర గుబులు రేపుతున్నాయి. గత ఏడాది కాలంలో యూరియా దొరక్క రైతులు పడిన ఇబ్బందులు ఇప్పటికీ కొనసాగుతుండగా, మార్కెట్‌లో నకిలీ, కల్తీ పత్తి విత్తనాల బెడద అన్నదాతలను వేధిస్తోంది. దీనికి తోడు పెరిగిన డీజిల్, పెట్రోల్, ఎరువుల ధరలు సాగును మరింత కుంగదీస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రైతులకు గత రెండేళ్లుగా ఒక్క రూపాయి కూడా అందలేదు సరికదా, గుర్తింపు కార్డుల ఊసే లేకుండా పోయింది. గత అక్టోబర్‌లో సంభవించిన 'మిఅఎష్ట్రుంగ్' తుఫాన్ బాధితులకు నేటికీ ఇన్‌పుట్ సబ్సిడీ గానీ, పంటల బీమా సొమ్ము గానీ, కరువు మండలాల పరిహారం గానీ విడుదల కాలేదు. సున్నా వడ్డీ పథకం నిధులు నిలిచిపోవడంతో వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయి. ప్రాజెక్టుల కింద నీటి విడుదల షెడ్యూల్ ఇచ్చినప్పటికీ ఎల్‌నినో మరియు వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకపోవడం ప్రభుత్వాల ముందుచూపు లేమికి నిదర్శనంగా నిలుస్తోంది. తెలంగాణలోనూ వ్యవసాయ రంగంపై ప్రభుత్వ తీరు సక్రమంగా లేదనే విమర్శలు వస్తున్నాయి. దేశీయ మార్కెట్‌తో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ వంటి అంతర్జాతీయ మార్కెట్లలో విపరీతమైన ఆదరణ మరియు డిమాండ్ ఉన్న ఎనిమిది రకాల మేలైన వరి వంగడాలనే సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు సూచించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో ఈ 8 రకాల వంగడాలను సాగు చేయించేలా చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు మంత్రులకు స్పష్టం చేశారు. ఈ నిర్దిష్ట రకాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభించే అవకాశం ఉందని, వీటికి విత్తనాల కొరత కూడా లేదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల నుంచి రైతులకు రక్షణ లభించాలన్నా ఈ రకాల సాగు ఒక్కటే మార్గమని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగవుతున్న అన్నిరకాల సన్న బియ్యానికి మార్కెట్‌లో ఆదరణ లభించడం లేదని, కొన్నిరకాల ధాన్యానికి మిల్లింగ్ చేస్తున్నప్పుడు నూకలు ఎక్కువగా వస్తున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించి, ఎగుమతులకు ఉపయోగపడే రకాలనే ప్రోత్సహించాలని నిర్ణయించారు. అయితే ఈ నిర్ణయాలు కేవలం కమిటీలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలని, వారికి సక్రమంగా విత్తనాలు సరఫరా చేసి అవే పంటలు పండించేలా అవగాహన సదస్సులు నిర్వహించినప్పుడే ఆశించిన సత్ఫలితాలు సాధించగలమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం

- అయినా పలు రకాల అనుమానాలు చక్కర్లు
- ఇరాన్‌కు 300 మిలియన్ డాలర్ల పరిహారం అంటూ వార్తలు
- అలాంటిదేమీ లేదని ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్
- అణ్వాయుధాలపై ఖచ్చితమైన ఒప్పందం కోసం పట్టు



**న్యూయార్క్, జూన్ 16:** అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ ఇంకా అనుమానాలు తొలగడం లేదు. అయితే అణ్వాయుధాలను కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించినట్లు సోమవారం డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇక తమ శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు 300 మిలియన్ల డాలర్ల ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో ఈ మేరకు స్పందించారు. ఇరాన్‌తో కుదిరే డీల్‌లో.. అణ్వస్త్రాలను డెవలప్ చేయబోమని ఆ దేశం అంగీకరించనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య ఎంవోయూ కుదిరినట్లు వార్తలు వెలుబడుతున్న విషయం తెలిసిందే. జెనీవాలో శుక్రవారం అధికారికంగా రెండు దేశాల మధ్య సంతకాలు జరిగే అవకాశం ఉన్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి రోజు నుంచి స్పష్టంగా ఉన్నారని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండబోదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అణ్వాయుధ సేకరణ కోసం ఇరాన్‌కు అనుమతి ఇవ్వబోమని ఇజ్రాయల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కూడా స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండవద్దు అని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానని, దీన్ని జీవిత మిషన్‌గా భావించానని అన్నారు. డీల్ కుదిరినా, కుదరకపోయినా, ఇరాన్ వద్ద న్యూక్లియర్ వెపన్ ఉండబోదన్నారు. ఇజ్రాయెల్ ప్రధానిగా తాను ఉన్నంత కాలం ఇలా జరగబోదన్నారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో సంక్షోభానికి తెరపడింది. అయితే, ఈ ఒప్పందం ట్రంప్ యంత్రాంగంలో విభేదాలను బయటపెట్టింది. అణ్వాయుధాలు విడిచిపెట్టాలన్న నిర్ణయానికి ఇరాన్ కట్టుబడి ఉంటుందా అనే విషయంపై కొందరు సీనియర్ అధికారులు అనుమానాలు వ్యక్తంచేసినట్లు అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఒప్పందం తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో..ఇరాన్ ఉద్దేశాలపై నిఘావర్గాల అంచనాలు ఆందోళనను రేకెత్తిస్తున్నాయని సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ ట్రంప్‌తో సహా ఉన్నతాధికారులను హెచ్చరించారు. ఒప్పందం నేపథ్యంలో శుద్ధి చేసిన యురేనియం విషయంలో ఇరాన్ అధికారుల మధ్య చర్చలకు.. వారు మధ్యవర్తులకు చేరవేస్తున్న సమాచారానికి ఎక్కడా పొంతన లేదని తెలుస్తోందన్నారు. అమెరికా డిమాండ్ చేస్తున్నట్లు అణ్వాయుధాలు విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేదని నిఘా వర్గాలు సూచిస్తున్నాయని తెలిపారు. రాట్‌క్లిఫ్‌తో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ లు కూడా అంతర్గత చర్చల్లో ఇదే ఆందోళనను వ్యక్తంచేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లు మాత్రం ఒప్పందానికి తమ మద్దతు తెలిపారు. కాగా, వైట్‌హౌస్ అధికారి ఒకరు ఈ వార్తలను ఖండించారు. శాంతి ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునే ముందు ట్రంప్ భిన్నాభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగిఉండకూడదని, శుద్ధి చేసిన యురేనియంను వారి వద్ద ఉంచుకోకూడదు అన్న కీలక షరతులతో ఈ ఒప్పందం చాలా స్పష్టంగా ఉందన్నారు. ఈ విషయంపై సీఐఏ, విదేశాంగ శాఖ స్పందించేందుకు నిరాకరించాయి.

# నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

- టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు




న్యూఢిల్లీ, జూన్ 16: నీట్ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఐటీ చట్టం సెక్షన్ 69ం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ 22 వరకు భారతదేశంలో టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై నియంత్రణ ఉండనుంది. ఈనెల 21న దేశవ్యాప్తంగా నీట్ 2026 రీ-ఎగ్జామ్ నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్ష భద్రతను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సు మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే, టెలిగ్రామ్‌లో ఈనెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష పూర్తయిన తర్వాత పాత టైమ్‌స్టాంప్‌లతో నకిలీ 'పేపర్ లీక్' ఆధారాలు సృష్టిస్తున్న ముఠాలను అడ్డుకోవడానికే మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌పై నిషేధం విధించినట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ పేరుతో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న నకిలీ టెలిగ్రామ్ ఛానళ్లపై ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగాలు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో 8 టెలిగ్రామ్ ఛానళ్లను నడుపుతూ రూ. 1.5 కోట్ల మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను సైబర్ క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. జూన్ 21న జరగనున్న రీ-ఎగ్జామ్‌కు ముందు ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై ఎన్‌టిఏ స్పందించింది. అవన్నీ తప్పుడు ప్రచారాలేనని స్పష్టం చేస్తూ, విద్యార్థులు అధికారిక సమాచారం కోసం వెబ్‌సైట్ ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది.

# ఆధార్ కార్డు దుర్వినియోగంపై పిటిషన్..

### కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీం కోర్టు నోటీసులు


**న్యూఢిల్లీ, జూన్ 16:** ఆధార్ కార్డుల దుర్వినియోగంపై దాఖలైన ఒక పిటిషన్‌పై సుప్రీం కోర్టు తాజాగా విచారణ చేపట్టింది. ఆధార్‌ను కేవలం ఐడీ ప్రూఫ్‌గా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. అశ్వినీ కుమార్ అనే న్యాయవాది ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆధార్ కార్డు కేవలం ఐడీ ప్రూఫ్‌గా మాత్రమే వినియోగమయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల సంఘానికి మార్గదర్శకాలు జారీ చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. పౌరసత్వం, స్థానికత, నివాస ధ్రువీకరణ పత్రంగా ఆధార్ వినియోగం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని అభ్యర్థించారు. కొత్త ఓటర్ రిజిస్ట్రేషన్ దరఖాస్తులో డేట్ ఆఫ్ బర్త్‌కు ధ్రువీకరణగా ఆధార్ వినియోగం ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం చెల్లదని అన్నారు. ఆధార్ కార్డు పౌరసత్వానికి ప్రూఫ్ కాదని స్పష్టమైన మార్గదర్శకాలు ఉప్పటికీ దుర్వినియోగం అవుతోందని అన్నారు. వయసు ధ్రువీకరణ, పౌరసత్వం, స్థానికత, స్కూలు అడ్మిషన్లు, ఆస్తుల కొనుగోళ్లు, బర్త్ సర్టిఫికేట్‌కు దరఖాస్తు వంటి సందర్భాల్లో ఆధార్ దుర్వినియోగం అవుతోందని ఆరోపించారు. దీనికి తోడుకు కొత్త ఓటర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఫార్మ్-6లో కూడా పుట్టిన రోజు ధ్రువీకరణ, నివాసధ్రువీకరణ పత్రంగా దుర్వినియోగం అవుతోందని అన్నారు. కాబట్టి, ఆధార్‌ను కేవలం ఐడీ ప్రూఫ్‌గా పేర్కొంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.




# ముస్సోరిలో విశాఖకు చెందిన టెక్కీ మృతి

### భర్తతో కలసి విహార యాత్రకు వెళ్లిన రాధాగాయత్రి

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**న్యూఢిల్లీ, జూన్ 16:** ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న 27 ఏళ్ల రాధా గాయత్రి ముస్సోరీలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందిన ఘటన కలకలం రేపుతోంది. భర్తతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ఆమె ముస్సోరీలోని హోమ్‌స్టే గదిలో విగతజీవిగా మారారు. మృతురాలిని పి. రాధా గాయత్రిగా గుర్తించారు. ఆమె భర్త సౌమ్య శ్రీచరణ్‌తో కలిసి సెలవులు గడిపేందుకు ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి వెళ్లారు. రాధా గాయత్రి, శ్రీ చరణ్ ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన వారు. వీరికి 2025 నవంబర్ 8న వివాహం జరిగింది. గాయత్రి ఢిల్లీలో నివసిస్తూ గురుగ్రామ్‌లోని ఒక ఐటీ సంస్థలో పనిచేస్తున్నారు. ఆమె భర్త శ్రీచరణ్ పుణెలో ఐటీ సంస్థలో పని చేస్తున్నారు. వీరిద్దరూ జూన్ 14 రాత్రి ముస్సోరీలోని కియానా హోమ్‌స్టేకు చేరుకున్నారు. భర్త చెప్పిన వివరాల ప్రకారం.. వారిద్దరూ ఆ రాత్రి మద్యం సేవించి, తెల్లవారుజామున 3:30 గంటలకు నిద్రపోయారు. శ్రీచరణ్ ఉదయం నిద్రలేచి చూసేసరికి.. గాయత్రి నగ్నంగా, స్పృహ లేకుండా, నేలపై పడి ఉంది. ఆమె ముక్కు నుంచి రక్తం కారుతోంది. హోమ్‌స్టే సిబ్బంది ముస్సోరీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు 108 అంబులెన్స్‌తో కలిసి ఆ ప్రదేశానికి చేరుకున్నారు. అంబులెన్స్ సిబ్బంది ఆమెను పరీక్షించి, మరణించినట్లు ధ్రువీకరించారు. గాయత్రి మృతదేహం నేలపై బట్టలు లేకుండా పడి ఉందని, పరుపుపై రక్తపు మరకలు కనిపించాయని, గదిలో రెండు ఖాళీ మద్యం సీసాలు, ఆహార పదార్థాలు లభ్యమయ్యాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం డెహ్రాడూన్‌లోని కరోనేషన్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# జీ7 వేదికపై మోదీ-ట్రంప్ భేటీ

### 16 నెలల తర్వాత ముఖాముఖి సమావేశం

**ఎవియన్ (ఫ్రాన్స్), జూన్ 16:** ఫ్రాన్స్‌లోని ఎవియన్-లెస్-బైన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అయ్యారు. దాదాపు 16 నెలల తర్వాత ఇరువురు నేతలు ముఖాముఖిగా కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. సదస్సు ప్రాంగణంలో పరస్పరం పలకరించుకున్న మోదీ, ట్రంప్ షేక్‌హ్యాండ్ ఇచ్చుకుని ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్య ఒప్పంద చర్చలు, సాంకేతిక సహకారం, సరఫరా గొలుసులు, కృత్రిమ మేధ (ఏఐ), భద్రతా అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య చర్చలకు ఈ సమావేశం మరింత ఊతమివ్వనుందని దౌత్యవర్గాలు భావిస్తున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు జీ7 సదస్సులో పాల్గొంటున్న ప్రధాని మోదీ, ప్రపంచ దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) ఆకాంక్షలను అంతర్జాతీయ వేదికపై ప్రస్తావించనున్నట్లు ముందుగానే ప్రకటించారు. భారత్ అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను బలంగా వినిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. జూన్ 16-17 తేదీల్లో జరుగుతున్న జీ7 సదస్సులో ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, కృత్రిమ మేధ, సరఫరా గొలుసులు, ఉక్రెయిన్ సంక్షోభం, మధ్యప్రాచ్య పరిస్థితులు, కీలక ఖనిజ వనరులు వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. భారత్ ఆహ్వానిత భాగస్వామ్య దేశంగా ఈ సమావేశంలో పాల్గొంటోంది. అంతకుముందు ప్రధాని మోదీ స్లోవాకియా పర్యటనలో అక్కడి ప్రధాని రాబర్ట్ ఫికో, అధ్యక్షుడు పీటర్ పెలెగ్రినీతో సమావేశమయ్యారు. వాణిజ్యం, రక్షణ, గ్రీన్ టెక్నాలజీ, ఆటోమొబైల్, రైల్వే రంగాల్లో సహకారానికి సంబంధించిన పలు ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా స్లోవాకియా అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్'ను ప్రధాని మోదీకి ప్రదానం చేశారు.

# ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి





- **చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన కలెక్టర్ ప్రియాంక.**

**నారాయణపేట, జూన్,16:**

విద్యార్థులు ఇష్టపడి చదివి జీవిత లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణపేట మండలం లోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో ముందుగా జాజాపూర్ పాఠశాలకు వచ్చానని, ఈ పాఠశాల వచ్చే సంవత్సరం పదో తరగతి లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలన్నారు.ఈ జిల్లా నుంచి గతంలో బాసర త్రిపుల్ ఐ టి కి ఎంపిక అయ్యారని ఆమె గుర్తు చేశారు. జాజాపూర్ పాఠశాల నుంచి కూడా త్రిపుల్ ఐ టి కి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ఇష్టంతో చదవాలన్నారు. బట్టి పట్టే విధానానికి స్వస్తి పలకాలన్నారు. లెక్కలను సులువుగా ఎలా చేయాలో విద్యార్థులకు ఆమె ప్రాక్టికల్ గా చేసి చూపించారు. విద్యార్థులకు పదో తరగతే పునాది లాంటిది అన్నారు. రాబోయే పదేళ్ల లో మీరు ఎలా ఉండాలో నోట్ బుక్ లో రాసుకుని, రోజూ దానిని చూస్తూ, అందుకు తగిన ప్రణాళిక ప్రకారం సాధన చేయాలని సలహా ఇచ్చారు. పదో తరగతిలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. అమ్మాయిలకు ఆర్థిక స్వాతంత్రం కావాలన్నారు. వచ్చే సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో టాపర్ గా నిలిచిన వారికి తన తరపున ప్రత్యేక బహుమతి ఇస్తానని కలెక్టర్ ప్రకటించారు. వచ్చే సంవత్సరం టాపర్ ను తప్పని సరిగా తన వద్దకు తీసుకు రావాలని హెచ్ ఎం కు సూచించారు.విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రయోగ శాల, గ్రంథాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు.చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన కలెక్టర్ జాజాపూర్ అంగన్ వాడిలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో చేరిన (అంగన్ వాడీ)చిన్నారులకు జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అక్షరాభ్యాసం చేయించారు. అంతకు ముందు సరస్వతీ మాత చిత్రపటానికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజు, మండల విద్యా శాఖ అధికారి బాలాజీ, ఆయా పాఠశాలల హెచ్ ఎం లు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# చిట్లపల్లి యూపీఎస్ పాఠశాలలో ఘనంగా 'అక్షరాభ్యాసం'

**కొడంగల్ మండలం, జూన్,16:**

మండల పరిధిలోని చిట్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళ వారం నూతనంగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి అరుణ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు శశికళ, రుక్మిణిముఖ్య అతిథులుగా హాజరయ్యారు.పుస్తకాల పంపిణీ: నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులతో పాటు, మిగిలిన విద్యార్థులందరికీ



ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోట్ బుక్స్‌ను అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రతి బిడ్డకు అక్షరాస్యత ఎంతో ముఖ్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని,తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గ్రామ సర్పంచ్ జ్యోతి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గోవర్ధన్, అబ్దుల్ హక్, రాజు, నాగప్ప, జ్యోతి, అనిత లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బాసర ట్రిబుల్ ఐటి లో సీటు సాధించిన విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సహాయం

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**లింగం పేట జూన్ 16:**

లింగంపేట్ మండలం శెట్పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, IIIT బాసరలో సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని డి. నిఖితను అభినందించారు. విద్యార్థిని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆమె విద్యాభ్యాసానికి తోడ్పాటుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రూ.10,000 ఆర్థిక సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకి కాకూడదని, అర్హులైన విద్యార్థులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ ,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 67 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో RDO , MRO, రెడ్ క్రాస్ ప్రతినిధులు ఎం. రాజన్న, ఏ. నాగరాజు గౌడ్, సంజీవరెడ్డి, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల బస్సుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్.**

**వికారాబాద్, జూన్,16:**

విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని,స్కూల్ బస్సుల నిర్వహణ, డ్రైవర్ల అర్హతలు, వాహనాల ఫిట్‌నెస్ విషయంలో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు,సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ సూచించారు.మోటారు వాహనాల చట్టం ప్రకారం స్కూల్ బస్సులకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పర్మిట్‌లతో పాటు బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ వంటి భద్రతా



సదుపాయాలు ఖచ్చితంగా ఉండాలని ఆదేశించారు. వాహనాలు నడిపే డ్రైవర్లు తగిన అనుభవం, లైసెన్స్ కలిగి ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు పాల్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.తల్లిదండ్రులు కూడా బస్సుల పరిస్థితిని, డ్రైవర్ల ప్రవర్తనను గమనిస్తూ, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలు, డ్రైవర్లపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# బడిబాటలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్..

- **చిన్నారులకు అక్షరాభ్యాసం, విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ**

**కామారెడ్డి , జూన్16:**

బడిబాటలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.. చిన్నారులకు అక్షరాభ్యాసం, విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ బడిబాట కార్య క్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం లింగంపేట మండలంలోని శెట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్ వాడీ కేంద్రా లను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పాఠ్యపుస్త కాలను పంపిణీ చేసి వారి విద్యాభివృద్ధికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి పలకలు, బలపాలను అందజేశారు. చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను పొందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



చేపడుతోందన్నారు. విద్యార్థుల హాజరు, అభ్యాస నైపుణ్యాల పెంపు, ప్రాథమిక విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో ప్రతిభ కనబరిచిన ఓ విద్యార్థినిని సన్మానించి అభినందించారు. అనంతరం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ నియంత్రణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక కిరాణా దుకాణాల యజమానులకు ప్లాస్టిక్ కు ప్రత్యామ్నా యంగా వినియోగించే డబ్బాలు, టిఫిన్ బాక్స్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీవో, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం



**దుద్యాల మండలం, జూన్,16:**

కొడంగల్ నియోజకవర్గం లగచర్ల గ్రామంలో కోడంగల్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఏనుముల తిరుపతిరెడ్డి చేతుల మీదుగా మంగళవారం వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది, ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.... వేల కోట్లు వెచ్చించి కోడంగల్ నియోజకవర్గాన్ని విద్యా, ఉద్యోగ, వైద్య, రంగాలలో శరవేగంగా ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ అన్ని విధాలుగా అండదండలుగా ఉండాలని విజ్ఞప్తి చేయడం జరిగింది, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో కొడంగల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు ముందుండాలని గుర్తు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావడం జరిగింది.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన MVI ఎస్.కే. మున్నీ



**నారాయణపేట, జూన్,16:**

నారాయణపేట జిల్లాకు నూతనంగా నియమితులైన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (MVI) ఎస్.కే. మున్నీ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS గారిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.వి.ఐ ఎస్.కే. మున్నీకి అభినందనలు తెలియజేశారు. జిల్లాలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ, ప్రజల్లో రవాణా నిబంధనలపై అవగాహన కల్పించడం వంటి అంశాల్లో రవాణా శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన చర్యలను అన్ని శాఖలు సమిష్టిగా చేపట్టాలని, ప్రజల ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో AMVI సాయి తేజ రెడ్డి,ఆర్టీఓ మెంబర్ పోషల్ రాజేష్ పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనకు ఎస్ఐఆర్ కీలకం

**శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు**



**ఆలేరు, జూన్ 16::**

ఆరోగ్యవంతమైన ఓటరు జాబితా రూపొందించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) లక్ష్యమని తహసీల్దార్ వి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం ఆలేరు బాలికల ఉన్నత పాఠశాలలో బూత్ లెవల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ద్వారా అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చి, మరణించినవారు, డబుల్ ఎంట్రీలు వంటి అనర్హ ఓటర్లను తొలగించి జాబితాను ప్రక్షాళన చేస్తామని చెప్పారు. ఈ నెల 25 నుంచి బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని, ఓటర్లు వాటిని నింపి తిరిగి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల శిక్షణాధికారులు హరనాథ్ రెడ్డి, దూడల వెంకటేష్, తిరుపతి రెడ్డి చిత్త రంజన్ తదితరులు పాల్గొన్నారు.

# సుభాష్ నగర్ పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**కరీంనగర్: జూన్16:**



సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజన వంటశాల, మంచినీటి సదుపాయాలు, ఆట స్థలం తదితర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల రీడింగ్, రైటింగ్, గణిత నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం, పాఠ్యపుస్తకాల పంపిణీ, పాఠశాల సన్నద్ధత కార్యక్రమాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు జూలై 15 వరకు గడువు పొడిగింపు: హైకోర్టు

**హైదరాబాద్, జూన్ 16:**

తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 జూలై 15 వరకు పొడిగిస్తూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జి.ఓ. ఎంఎస్ నెం.252 మరియు దానికి సంబంధించిన సవరణలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్‌తో పాటు మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల చెల్లుబాటును ప్రశ్నించిన ఫెడరేషన్, కేసు విచారణ పూర్తయ్యే వరకు అక్రిడిటేషన్‌కు సంబంధించిన సౌకర్యాలను కొనసాగించాలని కోర్టును కోరింది. పిటిషనర్ల తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తరఫున స్పెషల్ అడ్వకేట్ జనరల్ ప్రభుత్వ వైఖరిని కోర్టుకు వివరించారు. ప్రభుత్వ వాదనలు విన్న అనంతరం హైకోర్టు ప్రస్తుతం అమలులో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో నెల రోజుల పాటు పొడిగించాలని నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం ఉన్న అన్ని అక్రిడిటేషన్ కార్డులు 2026 జూలై 15 వరకు చెల్లుబాటులో ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో తెలంగాణ వ్యాప్తంగా అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావడంతో పాటు, అక్రిడిటేషన్‌కు అనుబంధంగా ఉన్న అన్ని సౌకర్యాలను కొనసాగించగలుగుతారు. వారి వృత్తి పరమైన బాధ్యతలకు ఆటంకం కలగకుండా ఈ ఉత్తర్వులు ఉపశమనం కల్పించాయి. ఇక తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ ఒక ఇంటర్‌లాక్యూటరీ అప్లికేషన్ కూడా దాఖలు చేశారు. అక్రిడిటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులు, జారీ చేసిన కార్డులు, తిరస్కరించిన దరఖాస్తుల సంఖ్యతో పాటు వాటి తిరస్కరణకు గల కారణాలను కోర్టు ముందు ఉంచాలని ఆయన కోరారు. ఈ దరఖాస్తును తదుపరి విచారణలో పరిశీలించనుంది. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఘౌస్ మొహియుద్దీన్ హైకోర్టు నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని పేర్కొంటూ, శాశ్వత పరిష్కారం కోసం తమ న్యాయపోరాటం కొనసాగుతుందని తెలిపారు. కోర్టు తదుపరి విచారణను 2026 జూలై 22కు వాయిదా వేసింది. అప్పటి వరకు జర్నలిస్టులు ఎలాంటి అనిశ్చితి లేకుండా తమ విధులను నిర్వర్తించనున్నారు. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా మీడియా వర్గాలకు ప్రాధాన్యత సంతరించుకుంది. అక్రిడిటేషన్ విధానాలు, వాటి అమలుపై ఉన్న ఆందోళనలను కూడా ఇది మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది.

## యూరియా కోసం ఆందోళన వద్దు.. యాప్ బుకింగ్ తో సులభంగా సరఫరా

ఇన్ చార్జ్ ఏడీఏ శ్రీదేవి



**మరిపెడ,జూన్16:**

:రైతులకు యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీదేవి తెలిపారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు ముందస్తుగా బుకింగ్ చేసుకుని సులభంగా యూరియాను పొందవచ్చని ఆమె పేర్కొన్నారు.మరిపెడ మండలంలో ప్రభుత్వ సంస్థలైన సొసైటీలు,అగ్రోస్,హాకా,ఒడిసిఎంఎస్ కేంద్రాలతో పాటు ప్రైవేట్ ఎరువుల దుకాణాల ద్వారా కూడా యూరియాను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.రైతులు తమ ఇంటి వద్ద నుంచే యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకుని,తాము ఎంపిక చేసుకున్న దుకాణానికి వెళ్లి బుకింగ్ ఐడీ నంబర్ చూపిస్తే యూరియా బస్తాలను పొందవచ్చని వివరించారు.రైతులు యూరియా సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తప్పనిసరిగా యాప్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.మొబైల్ నంబర్ నమోదు చేయించుకోని లేదా అప్డేట్ చేసుకోని రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి వివరాలను సరిచేసుకోవాలని కోరారు. యాప్ ద్వారా బుక్ చేసుకున్న రైతులకు మంగళవారం యూరియా పంపిణీ నిర్వహించారు.ఈకార్యక్రమంలో,వ్యవసాయ అధికారి బి.వీరాసింగ్,రైతులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## వర్షా ల ప్రభావిత ప్రాంతాల్లో ఎన్పీడీసీఎల్ సీఎండీ క్షేత్రస్థాయి పర్యటన




**నిర్మల్, జూన్ 16:**

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్ మంగళవారం నిర్మల్ సర్కిల్‌లో పర్యటించి, వర్షాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించారు. కడెం, ఖానాపూర్ పరిధిలోని గ్రామాల్లో పరిస్థితిని సమీక్షించి, విద్యుత్ అంతరాయాలు నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 33/11 కేవీ కడెం విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించిన సీఎండీ, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కడెం, పెంబి అటవీ ప్రాంతాల గుండా వెళ్లే 33 కేవీ, 11 కేవీ లైన్లపై కవర్డ్ కండక్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కడెం, పెంబి, దస్తురాబాద్ సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తాళ్లపేటలో 132 కేవీ సబ్‌స్టేషన్‌కు మంజూరు లభించిందని, నిర్మల్–ఖానాపూర్ 132 కేవీ లైన్‌ను డబుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. విద్యుత్ నిర్వహణ పనుల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, పీపీఈ కిట్లు తప్పనిసరిగా వినియోగించాలని సిబ్బందికి సూచించారు. వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ కల సాకారం దిశగా అడుగులు

- **భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తాం:**
- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
- **డిఫెన్స్‌కు 1,500 ఎకరాలు.. రన్‌వే విస్తరణకు మరో 80 ఎకరాలు**
- **ఎంపీ, ఎమ్మెల్యే, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష**

**అదిలాబాద్ జూన్16:**

ఆదిలాబాద్ జాయింట్ యూజర్ (డిఫెన్స్–సివిల్) ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో చేపడతామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, బెంగళూరుకు చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు, రాష్ట్ర సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన, మైక్రో లెవెల్ సర్వే నిర్వహించి, రన్‌వే విస్తరణతో పాటు సాంకేతిక అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చర్యలను వేగవంతం చేశామన్నారు. ఇప్పటికే 700 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, అదనంగా డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎయిర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) కోసం 1,500 ఎకరాలు, సివిల్ ఏవియేషన్ రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను కేటాయించేందుకు ప్రాథమిక ఆమోదం లభించిందని వివరించారు. జియో కోఆర్డినేట్ల ఆధారంగా భూసేకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేసిన కలెక్టర్, సీఎంఓ కార్యాలయం, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు త్వరితగతిన భూసేకరణ పూర్తి చేసి రక్షణ శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీకి భూములను అప్పగిస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు సివిల్ ఏవియేషన్‌తో పాటు డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రావడం ప్రజలకు ఒక చారిత్రాత్మక అవకాశమని పేర్కొన్నారు.

**ఢిల్లీ స్థాయిలో ఇప్పటికే చర్చలు: ఎంపీ గోడం నగేష్**

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన లొకేషన్ల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని ఎంపీ గోడం నగేష్ తెలిపారు. గత మార్చిలో ఢిల్లీలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డిలతో ఈ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించామని, మే 15న కేంద్ర ఉన్నతస్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా నిర్వహించిందని గుర్తుచేశారు. రక్షణ శాఖ కోరిన 1,500 ఎకరాల భూమి సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లా అధికారులతో కలిసి మ్యాప్‌ల ఆధారంగా మైక్రో లెవెల్ సమీక్ష నిర్వహించామని, ప్రాజెక్టు వేగవంతానికి నేటి సమావేశం కీలక ముందడుగు అని పేర్కొన్నారు.

**దశాబ్దాల కల నెరవేరబోతోంది: ఎమ్మెల్యే పాయల శంకర్**

జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణపై నేటి సమావేశంతో స్పష్టత వచ్చిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి మొత్తం 1,840 ఎకరాలు అవసరమవుతాయని, ఇందులో 1,500 ఎకరాలను రక్షణ శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. ఇప్పటికే 360 ఎకరాలు రక్షణ శాఖ పరిధిలో ఉండగా, రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను సేకరించాల్సి ఉందన్నారు. గతంలో జారీ చేసిన 700 ఎకరాల జీవో ప్రకారం పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 800 ఎకరాల అనుమతుల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని చెప్పారు. తదుపరి విధానపరమైన నిర్ణయాల కోసం త్వరలో ఎంపీ నేతృత్వంలో ఢిల్లీలో ఉమ్మడి సమావేశం జరగనుందని, ఇందులో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రాజ్‌నాథ్ సింగ్‌లతో చర్చలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో ఆదిలాబాద్ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోందని, జిల్లా అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకోనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశం, క్షేత్రస్థాయి పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్. రాజేశ్వర్, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు జేపీ సబర్వాల్, ఎస్.జి. హెగ్డే, ఎస్.కె. రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దామరగిద్ద పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ

- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.**
- **బాధితుల ఇండ్లకు వెళ్లి (ఆన్ సైట్ FIR) కేసులు నమోదు చేయాలి..**
- **ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి.**
- **ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి-ఎస్పీ.**




**దామరగిద్ద , జూన్,16:**

దామరగిద్ద: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS మంగళవారం దామరగిద్ద పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతినీ దామరగిద్ద ఎస్సై నరేష్ ను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. బాధితులకు ప్రజలకు వేగవంతమైన పోలీస్ సేవలు అందించాలని ఏవైనా సంఘటనలపై సమాచారం అందుకున్న వెంటనే బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి ఆన్ సైట్ FIR కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. అర్ధరాత్రి వేళ గ్రామాలలో రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. వివిధ సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి వచ్చిన బాధితులతో సమరస్యంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకొని సమస్యలపై సిబ్బంది వేగంగా స్పందించాలని ఆదేశించారు. పోలీసు సిబంది క్రమ శిక్షణ సమయ పాలన పాటించాలని అన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాను కఠినంగా నిరోధించాలని ఆదేశించారు. ప్రధాన రహదారిపై భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు మరియు గంజాయి నిర్మూలనపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటి ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. రాత్రి సమయంలో విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పూర్తిస్థాయిలో భద్రత, రక్షణ కల్పించాలని ఆదేశించారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రభుత్వ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు చేరువలో ఉంటూ మెరుగైన పోలీసింగ్ అందించాలని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్ దివాకర

**వైరా, జూన్ 16:**

వైరా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మందుల లభ్యత, పరిశుభ్రత, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రూ.37.50 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల నూతన ఏరియా ఆసుపత్రి పనులను పరిశీలించి, నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.



# నూతన హంగులతో మరిపెడ సర్కిల్ కార్యాలయం

- **త్వరలో ప్రారంభానికి సిద్ధం కానున్న ఆధునిక పోలీస్ స్టేషన్**




**మరిపెడ,జూన్16:**

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మరిపెడ పోలీసు సిబ్బంది,స్థానిక ప్రజల కల త్వరలో సాకారం కానుంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో నిర్మాణం చేపట్టిన నూతన సర్కిల్ కార్యాలయం,పోలీస్ స్టేషన్ భవనం తుది దశకు చేరుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది.ఆధునిక సౌకర్యాలు, విశాలమైన గదులు,ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా ఈభవనాన్నినిర్మించారు.2019లో ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగినప్పటికీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం,నిధుల విడుదలలో జాప్యం వంటి కారణాలతో పనులు ఆశించిన వేగంతో సాగలేదు.దీంతో నిర్మాణం పూర్తవడానికి అనుకున్న దానికంటే ఎక్కువ సమయం పట్టింది. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తికాగా,చివరి మెరుగులు దిద్దే పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు మరిపెడ పోలీస్ స్టేషన్ పాత భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తోంది.శిథిలావస్థకు చేరుకున్న ఆ భవనంలో పోలీసు సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారడంగోడలకు పగుళ్లు రావడం,రికార్డుల భద్రతకు ఇబ్బందులు తలెత్తడం వంటి సమస్యలు నిత్యకృత్యంగా మారాయి. అయినప్పటికీ సిబ్బంది ప్రజలకు సేవలందించడంలో వెనుకడుగువేయలేదు .నూతన భవనం అందుబాటులోకి వస్తే మరిపెడ,చిన్నగూడూరు,సీరోల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందనున్నాయి.ఫిర్యాదుల స్వీకరణ,కేసుల విచారణ,ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెరగనుండగా,ఆధునిక సాంకేతిక సదుపాయాలు, భద్రతా వ్యవస్థలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రారంభోత్సవంపై ఆసక్తి**

నూతన భవనాన్ని ఎవరి చేతుల మీదుగా ప్రారంభిస్తారనే అంశంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.అయితే త్వరలోనే ప్రారంభోత్సవం నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు వేగవంతం చేసింది.జిల్లా ఎస్పీ శభాష్ ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్ కుమార్,ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు పోలీసు వర్గాల సమాచారం.

**ప్రజల్లో హర్షం**

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభానికి సిద్ధం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ సర్కిల్ కార్యాలయం మరిపెడ ప్రాంతంలో పోలీస్ సేవలకు కొత్త రూపు తీసుకురానుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు మరింత చేరువగా,పోలీసు సిబ్బందికి మరింత సౌకర్యవంతంగా ఉండే ఈ నూతన పోలీస్ స్టేషన్ త్వరలోనే సేవలు ప్రారంభించనుంది.

## మంచినీటి బావులను శుభ్రంగా ఉంచుకోవాలి

**బావి మరమ్మతు పనులను ప్రారంభించిన అభినవ్ రెడ్డి**

**మరిపెడ,జూన్16:**

గ్రామాల్లోని మంచినీటి బావులను శుభ్రంగా ఉంచి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నూకల అభినవ్ రెడ్డిఅన్నారు.మంగళవారం మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామంలో మంచినీటి బావి మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో తాగునీటి వనరులు కలుషితం కాకుండా గ్రామ పంచాయతీ అధికారులు,సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెన్నెల నాగరాజు,ఉప సర్పంచ్ దేశెట్టి శ్రీనివాస్,పటేల్ దుర్గయ్య,రాజీల్క శ్రీనివాస్ చారి,మల్యాల శ్యాం,దండగల వెంకన్న, వంగూరి వెంకన్న,రాజీల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# 11వ వార్డు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**ఆలేరు, జూన్ 16::**



ఆలేరు పట్టణంలోని 11వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యకు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ తక్షణ చర్యలతో పరిష్కారం చూపారు. గత కొద్ది రోజులుగా వార్డులో నెలకొన్న నీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు స్థానిక కౌన్సిలర్ జూకంటి సంపత్ తెలియజేయడంతో ఆమె వెంటనే స్పందించి నవజీవన్ బీడీ కంపెనీ ఎదురుగా ఉన్న ఉన్న స్థలంలో బోరుబావిలో కొత్త మోటారు ఏర్పాటు చేయించారు. మంగళవారం నూతన మోటారును ప్రారంభించి ప్రజలకు నీటి సరఫరాను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో 11వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించినట్లు స్థానికులు తెలిపారు. ప్రజల అవసరాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జూకంటి శ్రీకాంత్, జూకంటి రమేష్, మున్సిపల్ సిబ్బంది రాజు, సురేందర్‌తో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# "షీ" టీమ్ పోలీసుల అవగాహన కార్యక్రమం

**దోమ మండలం, జూన్,16:**




దోమ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మం నాచారం దగ్గర కోళ్ల ఫామ్ లో పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు సమక్షంలో మహిళల పై జరుగుతున్న నెరలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు "షీ" టీమ్ ఇంచార్జి నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు:

1 మహిళలపై జరుగుతున్న నేరాలు,2 నిర్భయ చట్టం, POCSO చట్టం గురించి,3 .100 డయల్, "షీ" టీమ్ నం – 181సీసీ కెమెరాలు,4 బాల్య వివాహాలు,5 బాల కార్మిక వ్యవస్థ,6 కమ్యూనిటీ పోలీసింగ్,7 మానవ అక్రమ రవాణా,8 మద్యపాన నిషేధం,9 బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు,10 గంజాయి నిర్మూలన,11 డ్రగ్స్ నిషేధం, 12 సైబర్ నేరాలపై అవగాహన (నం: 1930).వివిధ అంశాల మీద అవగాహన కల్పిం కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కోళ్ల ఫామ్ మ్యానేజర్ మణికంఠ మరియు వర్కర్స్ ,"షీ" టీమ్ సభ్యులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.

# ఆయాల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

**జిల్లా విద్యాశాఖాధికారి నారాయణపేట**

**నారాయణపేట, జూన్,16:**

నారాయణపేట జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరానికి కొత్తగా మంజూరైన 44 ప్రీ–ప్రైమరీ సెక్షన్లలో ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు మరియు ఆయాల నియామక ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో అర్హులైన అభ్యర్థులకు మరింత అవకాశం కల్పించేందుకు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించడం జరిగింది.ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఇంటర్మీడియట్ (10+2) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళా అభ్యర్థులతో పాటు పురుష అభ్యర్థులు కూడా ఈ పోస్టులకు అర్హులుగా పరిగణించబడతారు. ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ (ECE), NTT, D.El.Ed., B.Ed. తదితర అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.ఆయా పోస్టుల కు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించబడింది.అభ్యర్థుల ఎంపికలో స్థానికతకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అదే నివాస ప్రాంతం, గ్రామపంచాయతీ, మండలం మరియు జిల్లా వారీగా ప్రాధాన్యత క్రమం అమలు చేయబడుతుంది.షెడ్యూల్

**19-06-2026 వరకు – దరఖాస్తుల స్వీకరణ**

**స్థలం:** సంబంధిత మండల విద్యాశాఖాధికారి (MEO) కార్యాలయం.20-06-2026 లోగా – దరఖాస్తుల పరిశీలన (Scrutiny) మరియు తుది ఎంపిక జాబితా తయారీ.

**కమిటీ:** సంబంధిత మండల విద్యాశాఖాధికారి (MEO) అధ్యక్షతన, ఆయా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో కూడిన కమిటీ ద్వారా పరిశీలన మరియు ఎంపిక ప్రక్రియ నిర్వహించబడుతుంది.

20-06-2026 లోగా – ఎంపిక జాబితాలు మరియు సంబంధిత రికార్డులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలి.కొత్తగా మంజూరైన 44 ప్రీ–ప్రైమరీ సెక్షన్లు ప్రారంభించాల్సిన నేపథ్యంలో అన్ని మండల విద్యాశాఖాధికారులు విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, నిర్దేశిత గడువులోగా ఎంపిక ప్రక్రియను పూర్తి చేయవలసిందిగా సూచించబడింది.ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన గౌరవ వేతనంపై నిర్వహించబడతాయి. తుది నియామకాలు జిల్లా స్థాయి ఆమోదానికి లోబడి ఉంటాయి.

# బడి బాట లో భాగంగా బోంరాస్ పేట్ పాఠశాల ఉపాధ్యాయ బృందం

**బొంరస్ పేట మండలం, జూన్,16:**




జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోంరాస్ పేట్ ఉపాధ్యాయ బృందం మొదటి బ్యాచ్ బడి బాట లో భాగంగా విద్యార్థుల నమోదు సందర్భంగా ప్రధానోపాధ్యాయులు . యన్.హరిలాల్ ఆదేశాల మేరకు నాందారు పూర్,ఏర్పుమల్ల,బాపల్లి తాండ, నాగిరెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జీవన్ ,కల్లూరి వెంకట్ రెడ్డి,కీసరు హైమద్... వారిని కలిసి మరియు అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామంలో ఉన్న పెద్దలను, ప్రజాప్రతినిధులను,అంగన్ వాడి ఉపాధ్యాయులను కలవడం జరిగింది.ఈ సందర్భంగా బాకారం మల్లయ్య ఉపాధ్యాయులు మాట్లాడుతూ... బోంరాస్ పేట్ మండల కేంద్రం లోని ఉన్నత పాఠశాల యందు విద్యార్థులకు డిజిటల్ బోధన, కంప్యూటర్ విద్య,వ్యాయామ శిక్షణ, స్కౌట్స్ మరియు గైడ్, ఉత్తమ ప్రతిభ వంతులైన ఉపాధ్యాయ బృందం చే నాణ్యమైన విద్య బోధన,పదవ తరగతి ఫలితాల యందు కార్పోరేట్ స్కూల్ స్థాయిలో ఉత్తమ ఫలితాలు 95%శాతం కలిగి,కోడంగల్ తాలూకా పరిధిలో అత్యధిక ఏనురోల్ మెంట్ కలిగి, ప్రతి విద్యార్థి పైన వ్యక్తి గత శ్రద్ద తీసుకోకపోవడం జరుగుతుంది తెలిపారు. కావున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు అందరికీ 2026-2027 విద్యా సంవత్సరంలో అత్యధిక ఏనురోల్ మెంట్ చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయ బృందం విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం బాకారం మల్లయ్య, పి.అనిల్ కుమార్,యెన్.లక్ష్మీకాంత్ రావు,పి.నర్సిములు, పి.కాశయ్య,పి.బాల్ రాజు,యెన్.మధుకరు,పి.మాధవ రెడ్డి, పి.కృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడమే లక్ష్యం

**కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా**

**హైదరాబాద్ జూన్16:**



హైదరాబాద్ జిల్లా విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడమే లక్ష్యం: కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా సూచించారు. మంగళవారం రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మమేకమై వారి అభ్యాసం, పాఠశాల వాతావరణంపై మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి దీటుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థుల డ్రాప్ అవుట్ లను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలను నిరంతరం తనిఖీ చేస్తూ విద్యార్థుల హాజరు శాతం, బోధన ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల వివరాలను ఆమె సమీక్షించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తరగతి గదులు, పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యక రమైన, పరిశుభ్రమైన వాతావరణంలో విద్యాబోధన జరగాలని ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజ్, ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## బోధన్‌లో ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, రెస్టారెంట్లపై తనిఖీలు

**బోధన్ జూన్16:**



బోధన్ పట్టణంలోని పలు ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, రెస్టారెంట్లలో ఆహార భద్రతాధికారి సోమవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలకు సంబంధించిన పలు లోపాలు గుర్తించారు. కొన్ని కేంద్రాల్లో సింథటిక్ ఆహార రంగులు, టేస్టింగ్ సాల్ట్ (ఎంఎస్‌జీ) వినియోగంతో పాటు రిఫ్రిజిరేటర్లలో నిల్వ ఉంచిన మిగిలిపోయిన ఆహార పదార్థాలను గుర్తించారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపార నిర్వాహకులకు మెరుగుదల నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం–2006 నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆహార వ్యాపారులు పరిశుభ్రత, పారిశుధ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## బడిబాటను సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్ దివాకర్ టీఎస్



**సింగరేణి జూన్16:**

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించాలని, డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి బడికి తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలని, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం, నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని అధికారులను ఆదేశించారు.

## పారదర్శకంగా ఎస్ ఐఆర్ నిర్వహించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్, జూన్ 16 :**

జిల్లాలో చేపట్టనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు, వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్వేచ్ఛాయుత ఎన్నికలకు తప్పులు లేని ఓటర్ల జాబితా అత్యంత కీలకమని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని సూచించారు. ఎస్ఐఆర్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే, జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, అక్టోబర్ 1న తుది జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఎస్ఐఆర్‌పై అవగాహన కోసం జూన్ 17న జిల్లా స్థాయిలో, జూన్ 18న నియోజకవర్గ స్థాయిలో 2కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రాష్ట్ర ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బంధు యాకయ్య

**మరిపెడ,జూన్16::**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన బంధు యాకయ్య తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు లావుడియా రాములు నాయక్ మంగళవారంప్రకటించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం,వారి హక్కుల పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల బలోపేతం లక్ష్యంగా బంధు యాకయ్యను రాష్ట్ర కమిటీలోకి ఎంపిక చేసినట్లు తెలిపారు.ఆయన పదవీకాలంఐదేళ్లపాటుకొనసాగనుంది.ఈ సందర్భంగా బంధు యాకయ్య మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన సంఘం రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయి పదవికి బంధు యాకయ్య ఎన్నిక కావడం పట్ల రాంపురంగ్రామప్రజలు,ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

చురకలు బుధవారం17 జూన్ 2026

# అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలి

**అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



**వికారాబాద్, జూన్,16:**

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు.మంగళవారం అనంతగిరి పర్యావరణ పర్యాటక కేంద్ర ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనులను పరిశీలించారు.జిల్లాలోని అనంతగిరి ప్రాంతంతో పాటు సర్పన్ పల్లి, కోట్ పల్లి ప్రాజెక్ట్ పర్యాటక అభివృద్ధికి పరిశీలించాలని ఆయన తెలిపారు. జిల్లాలోని ఆధ్యాత్మిక ప్రదేశాలను గుర్తించి పర్యాటక అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలలో అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ లను సమర్పించాలని కలెక్టర్ సూచించారు.పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, టూరిజం, అటవీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్



**వికారాబాద్, జూన్,16:**

వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా, IPS మంగళవారం వికారాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ రూమ్‌లతో పాటు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కీలక రికార్డులను, బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల నిర్వహణను, వివిధ కేసుల ఫైళ్లను తనిఖీ చేసి, పెండింగ్ కేసుల వివరాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో, ప్రజలతో సిబ్బంది ఎల్లప్పుడూ మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, బాధితుల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి వేళల్లో గస్తీ ని మరింత ముమ్మరం చేయాలని, వికారాబాద్ పట్టణంలో నేరాల నియంత్రణకు గానూ సీసీటీవీ కెమెరాల నిఘాను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ పెండింగ్ కేసులను త్వరగా ఛేదించాలని సూచించారు. అదేవిధంగా, విధి నిర్వహణతో పాటు సిబ్బంది తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటేనే పనితీరు మరింత మెరుగవుతుందని గుర్తుచేశారు. ప్రజలకు పోలీసు శాఖపై మరింత నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా సిబ్బందిని ఆదేశించారు.

# ఉద్యమకారుల గుర్తింపుకు 23 నుంచి సంప్రదింపులు



**హైదరాబాద్, జూన్ 16:**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఈ నెల 23వ తేదీ నుంచి వివిధ వర్గాలతో దశల వారీగా సంప్రదింపులు చేపట్టనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ వెల్లడించింది. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారకం అమరజ్యోతిని కమిటీ సభ్యులు సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యమకారుల గుర్తింపుపై చర్చించారు. విద్యార్థి జేఏసీ ప్రతినిధులు, కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాలు, న్యాయవాదులు, వైద్యులు తదితర వర్గాలతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించాలని నిర్ణయించారు. 2001 నుంచి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న వివిధ వర్గాల ఉద్యమకారుల గుర్తింపునకు అవసరమైన సూచనలు సేకరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో, అధికారుల ద్వారా ఆఫ్‌లైన్‌లో కూడా వినతులు, సూచనలు స్వీకరించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

# చెరువులు, వంతెనల మరమ్మతులు వెంటనే చేపట్టాలి: కలెక్టర్

**కరీంనగర్, జూన్ 16::**

వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలోని చెరువులు, కుంటలు, వంతెనల వద్ద అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. హుజూరాబాద్ మండలంలోని గుండ్ల చెరువుపై నిర్వహించిన సమీక్షలో మత్తడి ఎత్తు పెంచలేదని, కేవలం స్వల్ప మరమ్మతులు మాత్రమే చేసినట్లు అధికారుల నివేదికలో వెల్లడైంది. చెరువులోకి డ్రైనేజీ నీరు చేరకుండా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారీ వర్షాల సమయంలో ప్రమాదాలు నివారించేందుకు వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

# 12 ఏళ్ల బీజేపీ పాలనలో కార్పొరేట్లకు పండగ



సీపీఎం సెమినార్‌లో మాట్లాడుతున్న కల్లూరి మల్లేశం

**ఆలేరు, జూన్ 16::**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేస్తూ, సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం ఆరోపించారు. ఆలేరులో 12 ఏండ్ల బీజేపీ పాలన పరిశీలన అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రుణమాఫీలు, పన్ను రాయితీలు కల్పించగా, ప్రజలపై జీఎస్టీ రూపంలో భారీ భారం మోపారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రతి కుటుంబ ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. నోట్ల రద్దు నిర్ణయంతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని, కరోనా సమయంలో ప్రభుత్వ వైఫల్యాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను దెబ్బతీసే విధంగా లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని, రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను ప్రవేశపెట్టారని విమర్శించారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతూ వివిధ పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, పెట్రోల్, గ్యాస్ ధరల భారం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. ఎల్ఐసీ, రైల్వేలు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే చర్యలు దేశ ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. దేశ అప్పులు భారీగా పెరిగినా ప్రజల జీవన ప్రమాణాలు

# మహిళల ఆర్థిక స్వావలంబనకు నైపుణ్య శిక్షణలు అవసరం: సీతక్క



**ములుగు, జూన్ 16:(సమయం న్యూస్).**

మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, కుట్టు మిషన్, టైలరింగ్ వంటి ఉపాధి ఆధారిత శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అటవీ ఉత్పత్తులతో విలువ ఆధారిత వస్తువులు తయారు చేసి మార్కెట్‌లో విక్రయించాలని, నాణ్యతతో ఉత్పత్తులు రూపొందిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులను దృష్టిలో ఉంచుకుని మహిళా సంఘాలు స్థానిక ఉత్పత్తుల తయారీ, విక్రయాలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ఖమ్మం, జూన్ 16: జూన్:**

20న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని కోర్టు కేసుల నుంచి త్వరితగతిన ఉపశమనం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. దేవి మానస ఆధ్వర్యంలో బ్యాంకర్లు, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాజీయే రాజమార్గం" అంటూ లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులపై అప్పీల్ అవసరం ఉండదన్నారు. ఖమ్మం కోర్టులో 2,733 ఎన్ఐ చట్టం కేసులు, 1,118 ఇన్సూరెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని రాజీ ద్వారా పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు.



# పద్మశాలి టౌన్‌షిప్‌కు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**మల్కాజ్‌గిరి, జూన్ 16 :.**



పద్మశాలి టౌన్‌షిప్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి త్వరలోనే రిజర్వాయర్ నిర్మాణం చేపట్టనున్నట్లు జలమండలి ఈడీ పంకజం తెలిపారు. మంగళవారం టౌన్‌షిప్‌లో పర్యటించిన ఆమె స్థానిక సమస్యలను పరిశీలించి, అంతర్గత తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణానికి తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి వినతిపత్రం సమర్పించగా, డిసెంబర్ నాటికి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి తాగునీటి సరఫరా అందుబాటులోకి తీసుకొస్తామని ఈడీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పద్మశాలి టౌన్‌షిప్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీచర్ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానం

**జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ రషీద్**

**నారాయణపేట,జూన్,16:**

తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల నారాయణ పేట పాఠశాలలో టిజిటి ఆంగ్లం మరియు పిజిటి గణితం సబ్జెక్టులు బోధించుటకు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన అర్హుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ రషీద్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో బిఈడిలో మెథడాలజీ,పిజి మరియు టెట్ అర్హత కలిగి ఉండాలని, డెమో,మెరిట్ ఆధారంగా పోస్టుల ఎంపిక చేయబడుతుందని ఈ సందర్భంగా తెలిపారు.అభ్యర్థులు సంబంధిత పత్రాలతో తేది : 19-06-2026 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు,హెల్త్ కార్డు ఇవ్వాలి

- **సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందించిన టిడబ్ల్యూజేఎఫ్**

**వికారాబాద్, జూన్,16:**

అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డులు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రామచందర్, జిల్లా కార్యదర్శి ఎండి. షఫీలు కోరారు, మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మెమోరండం అందించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా జర్నలిస్టులు బాధ్యతాయుతమైన సేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో విలేకరుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎలాంటి గౌరవ వేతనం లేకుండానే సామాజిక బాధ్యతతో జర్నలిజం రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు కేటాయిస్తామని ప్రభుత్వల హామీగానే మిగులుతుందన్నారు, సొంత ఇండ్లు లేక, కిరాయి భరించలేక జర్నలిస్టులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని న్నారు, జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆరోగ్య హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి ఆరోగ్య భద్రత కల్పించే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడం అవసరమని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి వెంటనే ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.



# సాలార్ జంగ్ ప్లాటినం జూబ్లీలో గజల్ సంగీత విభావరి



**హైదరాబాద్, జూన్ 16:**

సాలార్ జంగ్ మ్యూజియం 75వ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన గజల్ సంగీత విభావరి సంగీతాభిమానులను అలరించింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయని శ్రీమతి లలిత ఆనంద్ తన మధుర గానంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. "రంజిష్ హీ సహీ", "ఏ కుచ్ అబ్రీ", "ఖాతిల్ తే ఇత్బార్", "ఝుకీ ఝుకీ సీ నజర్", "ఆజ్ జానే కీ జిద్ నా కరో" వంటి ప్రసిద్ధ గజల్స్‌ను ఆలపించి సభికుల ప్రశంసలు అందుకున్నారు. శాస్త్రీయ సంగీతం, గజల్ సాహిత్యం, రాగాల మాధుర్యం సమ్మిళితమైన ఈ ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, మాజిద్ హుస్సేన్, మీర్జా రహమత్ బేగ్ తదితరులు హాజరయ్యారు. సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ సంగీత కార్యక్రమం భారతీయ సంగీత, సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించిందని నిర్వాహకులు తెలిపారు.



# మానవతావాది చిలకమర్తి లక్ష్మనరసింహం

## నేడు సంఘ సంస్కర్త చిలకమర్తి వర్ధంతి

సాధారణంగా పుస్తకాలలో చదవడం కన్నా, దృశ్య శ్రవణ రూపంలో చూపిస్తే, వినిపిస్తే, అవలీలగా అందరికీ చేరి, ఎప్పటికీ గుర్తుండి పోతుంది. ఈ విషయాన్ని ఎప్పుడో గ్రహించిన పూర్వీకులు ప్రయోగాత్మకంగా చేసి సఫలీకృతులైనారు. నాటి నాటకాలు, వీధి భాగోతాలు, హరికథలు, బుర్రకథలు, ముఖ్యంగా మన పౌరాణికాలు, ప్రబంధాలు సామాన్య ప్రజలకు అతి సులువుగా అర్థమయ్యేటట్లు చేశారు. అలాంటి ప్రజానాడి తెలిసి తదనుగుణంగా సామెతలు, నుడికారాలు, లోకోక్తులను, జాతీ యాలను తన నాటక రచనలలో చొప్పించి, ఆయా పాత్రల ద్వారా సగటు ప్రేక్షకునికి ఎంతో అనుభూతిని అందచేసిన మహా రచయిత, మానవతా వాది, దాదాపు పాతిక వరకు నాటకాలను సృష్టించిన సంఘ సంస్కర్త, జాతీయ, అంతర్జాతీయ సాహితీ పండితుల మన్ననలను పొందిన మహనీయుడు చిలకమర్తి. చిలకమర్తి లక్ష్మీనరసింహం ( సెప్టెంబరు 26, 1867 – జూన్ 17, 1946) కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణ వాది, విద్యావేత్త. 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభ కాలంలో తెలుగు సాహిత్యం అభివృద్ధికి, తెలుగు నాట ఆధునిక భావాల వికాసానికి పట్టుకొమ్మలైన వారిలో చిలకమర్తి ఒకరు. మహాకవి, కళాప్రపూర్ణ ఆయన బిరుదులు. ఇరవై రెండేళ్ళ వయస్సప్పుడు ఆయన రచించిన "గయోపాఖ్యానం" అనే నాటకం "ప్రతులు లక్ష"కి పైబడి అమ్ముడు పోవట మనేది తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన విషయం. లక్ష్మీ నరసింహం 1867 సెప్టెంబర్ 26 న పశ్చిమ గోదావరి జిల్లా, పెరవలి మండలము లోని ఖండవల్లి గ్రామములో ఒక బ్రాహ్మణ కుటుంబములో వెంకయ్య, రత్నమ్మ దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య వీరవాసరం, నరసాపురం పట్టణాలలో సాగింది. 1889లో రాజమండ్రి హైస్కూలులో పట్టం చేత పట్టుకొన్నారు. 1889 లో రాజమండ్రి ఆర్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా చేరారు. తరువాత ఇన్నీసు పేట స్కూలు లోనూ, మునిసిపల్ హైస్కూలు లోనూ విద్యాబోధన సాగించారు. తరువాత ఒక సంవత్సరం "సరస్వతి పత్రిక" సంపాదకునిగా పని చేశారు. ఆపై ఉద్యోగం విరమించి 1899లో హిందూ లోయర్ సెకండరీ స్కూల్ స్థాపించి 9 సంవత్సరాలు నడిపారు. తరువాత ఆ పాఠశాల వీరేశలింగం ఉన్నత పాఠశాలగా మార్చ బడింది. పాఠశాలలో ఉన్నపుడే పద్యాలు వ్రాయడం ప్రారంభించిన లక్ష్మీ నరసింహం ఎన్నో రచనలు చేశారు. "కీచక వధ" ఆయన మొదటి నాటకం. తరువాత ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతా కళ్యాణం, పారిజాతాపహరణం వంటి నాటికలు రచించారు. గయోపాఖ్యానం నాటకంలో "టంగుటూరి ప్రకాశం పంతులు అర్జునుడి వేషం" వేసేవారు. ఆయన వ్రాసిన నవలలలో రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి, సుధా శరచ్చంద్రము ముఖ్యమైనవి. సరస్వతి పత్రిక సంపాదకునిగా ఉన్నపుడు సౌందర్య తిలక, పార్వతీ పరిణయం వ్రాశారు. ఇంకా అనేక రచనలు చేశాడు.అటు తెనుగు సాహిత్య, నాటక రంగాలకు, ఇటు సంఘ సంస్కరణోద్యమానికి మహోన్నత సేవలను అందించిన అపూర్వ వ్యక్తి కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీ నరసింహం. వీరు రచించిన "గయోపాఖ్యానం" నాటక పద్యాలు, "వందేళ్ళ" నుండి తెలుగు వారి నోట వినిపిస్తూ ఉన్నాయి. నాటక సమాజం ఉన్న ప్రతీ ఊరులోనూ ఈ నాటకాన్ని ప్రదర్శించారు. 1943 నాటికి లక్ష ప్రతులు (కాపీలు) అమ్ముడు పోయినాయి అంటే అది ఎంత గొప్ప రచనో చెప్పకనే తెలుస్తోంది. 1908లో ఒక ప్రెస్ స్థాపించారు. 1916 లో మనోరమ, పత్రిక అనే పత్రిక స్థాపించారు. దీని ద్వారా గణపతి, రాజరత్నము, రఘుకుల చరిత్ర (కాళిదాసు రచన రఘు వంశానికి అనువాదం), సిద్ధార్థ చరిత్ర వంటివి ప్రచురించారు. 21 అధ్యాయాల్లో రాసిన స్వీయ చరిత్రములో, ఆయన జీవిత కృషి మొత్తం వివరించ బడింది. బాల్యం, నర్సాపురంలో చదువు, రాజమండ్రిలో విద్యాభ్యాసం, ఉద్యోగం. గ్రంథరచన, నాటక సమాజం, వివాహం, మండల సభల్లో పాల్గొనడం, రామమోహన పాఠశాల ఏర్పాటు, నిర్వహణ, ఉన్నత పాఠశాల ప్రారంభం, కుటుంబ సమస్యలు, కష్టాలు, టంగుటూరి ప్రకాశం ఇంగ్లండ్ యాత్ర, హితకారిణి సమాజ స్థాపన, అచ్చు యంత్రాన్ని నెలకొల్పడం, భారత జాతీయ కాంగ్రెస్ సభకు హాజరవడం, పత్రికా సంపాదకత్వం, నిర్వహణ -- యివన్నీ సవివరంగా రాశారు. చిలకమర్తి ఏకసంధాగ్రాహి మాత్రమే కాదు, అద్భుతమైన జ్ఞాపక శక్తి కలిగి, స్వీయ చరిత్రలో, తన జీవిత కాలంలో జరిగిన ఘటనలను, సూక్ష్మాంశాలతో సహా చిత్రించారు. చారిత్రక ఘటనలను సమతూకం తోనూ, వ్యక్తుల గూర్చి రాస్తున్నప్పుడు రాగద్వేషాల కతీతంగా, స్పష్టంగా, క్లుప్తంగా రాశాడు. నిత్యనైమిత్తకాల గూర్చి రాస్తున్నా, వాటినొక అంతర్ దృష్టితో పరికించారు. లక్ష్మీ నరసింహం మొదటి తరం సంఘ సంస్కర్త. 1909 లో సామాజికంగా వెనుక బడిన వర్గాలకోసం ఒక పాఠశాల (రామమోహన పాఠశాల) స్థాపించారు. నిమ్న జాతుల వారి గురించి ప్రత్యేకంగా ఒక పాఠశాలను స్థాపించిన ఘనత ఆంధ్ర దేశంలో చిలకమర్తి వారికి దక్కుతుంది. ఎందుకంటే అంతకు మునుపు ప్రభుత్వంచే నడుప బడుతున్న ఒకటి రెండు పాఠశాలలు తప్ప దళితుల కోసం ప్రత్యేకమైన పాఠశాలలను ఎవరూ స్థాపించ లేదు. కేవలం తన పుస్తకాల నుండి వచ్చిన రాబడితోనే, తన స్వంత ధనంతో ఆ రామమోహన పాఠశాలను 13 సంవత్సరాలు నడిపి హైయ్యర్ ఎలిమెంటరీ స్కూల్ గా చేసారు. బ్రహ్మసమాజం, హితకారిణీ సమాజం వంటి సంస్కరణ దృక్పథం గల సంఘాల కార్య కలాపాలలో పాలు పంచుకొన్నారు. దేశమాత అనే వారపత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వ్యాసాలు వ్రాశారు. గాంధీజీ భారత రాజకీయ పటంలోకి రాక మునుపే హరిజన బాలులకు చదువు చెప్పేందుకు " రాజారామోహన రాయి పాఠశాలను " నడిపించి తనలో నిక్షిప్తమై ఉన్న సంస్కరణా భిమానాన్ని చాటి చెప్పారు. ఇన్ని సుగుణాల సమాహారం మన చిలకమర్తి లక్ష్మీనరసింహం. తనకు మార్గదర్శకుడైన వీరేశలింగం పంతులు గారితో కలసి, రాజమహేంద్ర వరంలో హితకారిణీ సంస్థ నడిపించారు. కనుచూపు కోల్పోయినా, పరిస్థితులకు ఎదురొడ్డి నిలచి, పోరాడి, జీవితాంతం తెలుగు సాహిత్య నాటక రంగాలకు, సాంఘిక సంస్కరణలకు తన జీవిత కాలం ధారపోశారు. ఓ సుప్రసిద్ధ నాటక కర్తగా, హాస్య రచయితగా, పద్య, గద్య రత్నాకరుడిగా, నవలా రచయితగా తన రచనలతో సామాజిక ప్రయోజనాన్ని ఆశించి సాధించారు. "గురజాడ వారి కన్యాశుల్కం, వేదం వారి ప్రతాప రుద్రీయం, శ్రీపాద గారి బొబ్బిలి యుద్ధం, చిలకమర్తి వారి గయోపాఖ్యానం" తెలుగు నాటక మణి రత్నాలు. అనేక తెలుగు పద్య, గద్య రచనలు కావించారు చిలకమర్తి. వీటిలో అత్యధికాధరణలు పొందినవి 'గయోపాఖ్యానం', 'గణపతి'. 1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనను కళాప్రపూర్ణ పురస్కారంతో సత్కరించింది. 1946, జూన్ 17న లక్ష్మీనరసింహం మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రథమ స్వాతంత్ర్య సమరయోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి

## నేడు ఝాన్సీ రాణి వర్ధంతి



ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారత దేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది.

1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి విస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు. ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారత దేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీ కీ రాణి గ ప్రసిద్ధికెక్కినది. 1857లో భారత దేశ తిరుగుబాటు దార్లలో ముఖ్యమైన వాళ్ళలో ఆమె ముఖ్యమైనది. ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనారోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహ ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బందువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21న గంగాధరరావు మరణించాడు. హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు. దామోదర్ రావు రాజాకు రక్త సంబంధం కానందు వలన అంటే దత్త సంబంధం కావున, ఈస్ట్ ఇండియా కంపనీ గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసి, సిద్ధాంతం ప్రకారం రావు సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని అతనిని నిరాకరించాడు. రాణి ఝాన్సీని ఇవ్వకూడదని నిశ్చయించు కొన్నది. ఆమె తన సైన్యాన్ని బలపర్చి, తమకు తాముగా వచ్చిన వాళ్ళను పోగుచేసి ఒక సేనను తయారు చేసింది. మహిళలకు కూడా యుద్ధ శిక్షణ ఇవ్వబడింది. యుద్ధ వీరులైన గులాం గాస్ ఖాన్, దోస్త్ ఖాన్, ఖుదా బక్ష్, లాల భు బక్షి, మోతీ బాయి, సుందర్ – ముందర్, ఖాసి బాయి, దీవాన్ రఘునాథ్ సింగ్, దీవాన్ జవహర్ సింగ్ రాణి బలగంలో ఉన్నారు. అలా జరిగిన యుద్ధంలో లక్ష్మీబాయి 1858 జూన్ 17 న గ్వాలియర్ లో యుద్ధ సమయములో మరణించింది. గ్వాలియర్ యుద్ధం గురించి జనరల్ రోస్ ప్రస్తావిస్తూ విప్లవ కారుల్లోకెల్లా ఆమే అత్యంత ధైర్య సాహసాలతో పోరు సల్పిందని కితాబిచ్చాడు. ఆమెకున్న ధైర్యము, పరాక్రమము, వివేకము, భారత దేశంలో 19 వ శతాబ్దములో మహిళలకున్న అధికారం పై ఆమెకున్న ముందుచూపు, ఆమె చేసిన త్యాగాలు ఆమెను స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రసిద్ధ వ్యక్తిగా నిలిపింది. "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఆమె భారత దేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయింది.

# 'బ్రహ్మ కు ప్రీతి పాత్రం జ్యేష్ఠ మాసం'

జ్యేష్ఠ మాసం బ్రహ్మదేవుడికి ఎంతో ఇష్టమైనది. ఈ మాసంలో ఆయనను ఆరాధించిన వారిని, బ్రహ్మదేవుడు సులభంగా అనుగ్రహిస్తాడని విశ్వాసం. ఈ మాసంలో చేసే పూజలు, జపాలు, పారాయణాదులకు విశేష ఫలముంటుందని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఈ మాసంలో చేసే విష్ణు సహస్రనామ పారాయణం అనంత ఫలాన్ని స్తుంది. జ్యేష్ఠం తెలుగు మాసాలలో మూడవది. ఈ మాసంలో వచ్చే పర్వాలలో ఏరువాక పున్నమి, నిర్జల ఏకాదశి, దశ పాప హర దశమి, రంభా వ్రతం వంటివి ముఖ్యమైనవి. చాంద్ర మానం ప్రకారం చైత్ర, వైశాఖ మాసాల తరువాత వచ్చే జ్యేష్ఠ మాసం కూడా కొన్ని ముఖ్యమైన వ్రతాలకు, పర్వ దినాలకు ఆలవాల మైనది. పితృదేవతల రుణం తీర్చుకోవడానికి, పాపాలను హరించు కోవడానికి, దైవసేవలో తరించడానికి ఉద్దేశించిన కొన్ని పుణ్య తిథులు జ్యేష్ఠ మాసంలో ఉన్నాయి. జ్యేష్ఠ మాసంలో ముఖ్యంగా... పది పాపాలను పోగొట్టే దశ పాప హర దశమి వ్రతాన్ని జ్యేష్ఠ శుద్ధ ప్రతిపద నుండి ఆచరిస్తారు. తదియ నాడు

పార్వతీదేవి ఆచరించిన 'రంభా వ్రతం', చవితి నాడు ఉమా పూజనం, షష్ఠి నాడు వివాహితలు ఆచరించే 'అరణ్య గౌరీ వ్రతం', గంగానది స్నానంతో పది రకాల పాపాలను హరించే 'దశపాప హర దశమి'.. 'త్రివిక్రమ ఏకాదశి' పేరుతో పిలిచే 'నిర్జల ఏకాదశి', విద్యారణ్యుల ఆరాధన త్రయోదశి రోజున, ఈ మాసంలోని ప్రత్యేక తిథులు. అలాగే సూర్యుడిని ఆరాధించే 'మిథున సంక్రమణం', వ్యవసాయ సంబంధ పర్వమైన 'ఏరువాక' (వృషభ పూజ) కూడా ఈ నెలలో వచ్చే విశేషాలే.

ఇక, దాన ధర్మాలకు అవకాశమిస్తూ విశేష పుణ్య ఫలాలను ప్రసాదించే 'జ్యేష్ఠ పౌర్ణమి', వివాహితులైన స్త్రీలు ఆచరించే వట సావిత్రీ వ్రతం, ఏడాదిలో ఇరవై నాలుగు ఏకాశుల ఫలాన్ని నీరు, ఆహారం లేకుండా ఉంటే వస్తుందని వ్యాసుడు, భీమునికి వివరించిన "నిర్జల ఏకాదశి' ఈ మాసాన్ని ప్రభావితం చేస్తుంటాయి. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశినే నిర్జల 'మతత్రయ' ఏకాదశి అనే పేరుతోనూ పిలుస్తారు. ఏకాదశి వ్రతాన్ని ఆచరించి పెసరపప్పు, పాయసం, పానకం, నెయ్యి, గొడుగు పేదవారికి దానం చేయాలని శాస్త్రాలు తెలియ జేస్తున్నాయి. నిర్జల ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తే 12 ఏకాదశులను ఆచరించిన ఫలితం దక్కుతుంది. జ్యేష్ఠ శుద్ధ ద్వాదశిని దశహరా అంటారు. ఇది దుర్దశలను పోగొట్టగలిగే శక్తి కలిగిన తిథి. ఈరోజు నది స్నానాలు చేయాలి.

జ్యేష్ఠ బహుళ ఏకాదశిని యోగినీ 'వైష్ణవ మాధ్వ ' ఏకాదశి, సిద్ధ ఏకాదశి అని కూడా అంటారు. అంటారు. కుబేరుని తోటమాలి.. కుబేరుని శాపంతో కుష్టు వ్యాధిగ్రస్తుడయ్యాడు. చివరకు ఆయన ఈ ఏకాదశి నాడు ఏకాదశి వ్రతాన్ని శాస్త్రయుక్తంగా చేశాడు. ఫలితంగా కుష్టు రోగం పోయింది. జ్యేష్ఠ బహుళ చతుర్దశి మాస శివరాత్రి ప్రదోష కాలంలో శివునికి అభిషేకం, బిల్వదళాలతో




పూజిస్తే అకాల మృతయుహరణం, యశస్సు కీర్తి, ఆరోగ్యం లభిస్తాయి.

జ్యేష్ఠ పూర్ణిమను మహాజ్యేష్టి అంటారు. ఈ రోజున తిలలు దానం చేసిన వారికి ఆశ్వమేథ యాగం చేసిన ఫలితం లభిస్తుంది. ఈ పౌర్ణమినే ఏరువాక పున్నమి పేరుతో జరుపుకుంటారు. ఇది రైతుల పండుగ.. ఎద్దులను అలంకరించి పొంగలి పెట్టి, ఊరేగింపుగా పొలాల వద్దకు తీసుకెళ్లి దుక్కి దున్నిస్తారు. జ్యేష్ఠ పౌర్ణమి నాడు సావిత్రీ వ్రతం ఆచరించిన వారికి సౌభాగ్యం వృద్ధి అవుతుందని విశ్వాసం. వైధవ్యం రాకుండా ఈ పర్వం చేస్తుందని, సువాసినులు, ఉపవాస దీక్షలో వుండి, వట వృక్ష పూజ చేస్తారు.

అలాగే, ఈనాటి రాత్రి మర్రిచెట్టు కింద ఉన్న సావిత్రిని పూజించాలి. ఈనాడు స్త్రీలు ఉపవాసం ఉండి జలముతో వటవృక్షాన్ని తడపాలి. ఆ చెట్టు చుట్టూ ఎనిమిది సార్లు దారం చుడుతూ ప్రదక్షిణం చేయాలి. మర్నాడు సువాసినీ స్త్రీలకు భోజనం పెట్టాలి. ఆ వ్రతం చేసే స్త్రీ సర్వదా సౌభాగ్యవతి అవుతుందని ప్రతీతి. బ్రహ్మ దేవుడి ప్రతిమను గోధుమ పిండితో తయారు చేసుకుని, ఈ నెల రోజుల పాటు పూజించడం వలన విశేషమైన ఫలితాలను పొందవచ్చని, ఆయా వ్రత గ్రంథాలను బట్టి తెలుస్తోంది.

జ్యేష్ఠ మాసంలో గొడుగు, చెప్పులను అనాధలకు, నిర్భాగ్యులకు దానం చేసిన వారికి ఉత్తమగతులతో పాటు ఐశ్వర్యం ప్రాప్తిస్తాయని విష్ణు పురాణం తెలిపింది. వామన ప్రీతికి విసనకర్ర, జల కలశం, మంచి గంధం దానం చేయాలి. అలాగే నీళ్ళను దానం చేయడం వలన చాలా ఉత్తమమైన ఫలితాలు దక్కుతాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# భారత్‌లోకి స్కోడా కోడియాక్ ఆర్‌ఎస్

## తొలి ఆర్‌ఎస్ 7-సీటర్ ఎస్‌యూవీ



**న్యూఢిల్లీ, జూన్ 16 :** భారత ఆటోమొబైల్ మార్కెట్లో స్కోడా తన సరికొత్త కోడియాక్ ఆర్‌ఎస్ ఎస్‌యూవీని ఆవిష్కరించింది. ప్రపంచవ్యాప్తంగా 50 ఏళ్ల రేసింగ్ వారసత్వం, 125 ఏళ్లకు పైగా మోటార్‌స్పోర్ట్స్ అనుభవాన్ని ప్రతిబింబించే ఈ వాహనం భారత్‌లో 'ఆర్‌ఎస్' గుర్తుతో విడుదలైన తొలి 7-సీటర్ లగ్జరీ ఎస్‌యూవీగా నిలిచింది. స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా వెల్లడించిన వివరాల ప్రకారం, ఇది దేశంలోనే అత్యంత వేగవంతమైన స్కోడా వాహనంగా గుర్తింపు పొందనుంది. గతంలో విడుదలైన ఆక్టేవియా ఆర్‌ఎస్‌కు లభించిన విశేష ఆదరణను దృష్టిలో ఉంచుకుని, కోడియాక్ ఆర్‌ఎస్ బుకింగ్‌లను జూన్ 22 నుంచి ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రకటించింది. వేగం, విలాసవంతమైన సౌకర్యాలు, ఏడుగురు ప్రయాణికులకు అనువైన విశాలమైన స్థలం, ఆధునిక భద్రతా వ్యవస్థలతో ఈ వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. రేసింగ్ స్ఫూర్తితో రూపొందించిన ఈ ఎస్‌యూవీలో అత్యాధునిక నాలుగు చక్రాల డ్రైవ్ వ్యవస్థను అందించారు. సాధారణ రహదారులతో పాటు కఠినమైన మార్గాల్లోనూ సమర్థవంతంగా ప్రయాణించేలా ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. కోయంబత్తూర్‌లో నిర్వహించిన రేస్ ట్రాక్ పరీక్షల్లో స్కోడా వాహనాలు నమోదు చేసిన రికార్డులు సంస్థ ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని చాటాయని కంపెనీ పేర్కొంది. పనితీరు, ఖచ్చితత్వం, బలమైన ఆఫ్‌రోడ్ సామర్థ్యాలను కోరుకునే వినియోగదారులకు కోడియాక్ ఆర్‌ఎస్ ఉత్తమ ఎంపికగా నిలుస్తుందని సంస్థ అభిప్రాయపడింది. భారత మార్కెట్లో ప్రీమియం ఎస్‌యూవీ విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా స్కోడా ఈ కొత్త మోడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

# ఈ20 ఇంధనంపై తప్పుడు ప్రచారం.. కేంద్రం ఖండన

**న్యూఢిల్లీ, జూన్ 16 :** ఈ20 ఇంధనం వినియోగిస్తే వాహన బీమా క్లెయిమ్‌లు తిరస్కరించే అవకాశం ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఈ20 ఇంధనం వాడినంత మాత్రాన వాహన బీమా పాలసీలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. పత్రికా సమాచార విభాగం వాస్తవ నిర్ధారణ విభాగం సామాజిక మాధ్యమ వేదికలో స్పందిస్తూ.. ఈ20 ఇంధనం కారణంగా బీమా క్లెయిమ్‌లను తిరస్కరిస్తారన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొంది. ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక వనరుల ద్వారా మాత్రమే సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని సూచించింది. దేశంలో ఇథనాల్ మిశ్రమ ఇంధన వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ముడి చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ఇంధన భద్రతను పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ20 ఇంధనం ఇప్పటికే దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చింది. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ85 ఇంధనాన్ని కూడా కేంద్రం ప్రారంభించింది. ప్రస్తుతం 48 ఇంధన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఈ ఇంధనాన్ని 2026 చివరి నాటికి 500 కేంద్రాలకు, 2027 చివరి నాటికి 5 వేల కేంద్రాలకు విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఈ20 ఇంధనం వినియోగంపై వస్తున్న తప్పుడు వార్తలను ప్రజలు నమ్మవద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది.




# డీజిల్, విమాన ఇంధన ఎగుమతులపై పన్ను పెంపు




**న్యూఢిల్లీ, జూన్ 16 :** మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశీయ ఇంధన లభ్యతకు భంగం కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్, విమాన ఇంధనం ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ లాభాల పన్నును పెంచుతూ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పెట్రోల్‌పై ఉన్న పన్నును యథాతథంగా కొనసాగించింది. జూన్ 16 నుంచి అమల్లోకి వచ్చే తాజా నిర్ణయం ప్రకారం డీజిల్ ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ. 13.50 నుంచి రూ. 14కు పెంచారు. అలాగే విమాన ఇంధనం ఎగుమతులపై పన్నును లీటరుకు రూ. 9.50 నుంచి రూ. 12.50కు పెంచినట్లు ప్రకటించారు. పెట్రోల్ ఎగుమతులపై మాత్రం లీటరుకు రూ. 1.50 సుంకాన్ని యథాతథంగా కొనసాగించారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు, అమెరికా జోక్యంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో చమురు సంస్థలు దేశీయ అవసరాలను పక్కనబెట్టి అధిక లాభాల కోసం విదేశాలకు ఇంధనాన్ని భారీగా ఎగుమతి చేయకుండా నిరోధించడమే కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో దేశీయ మార్కెట్లో ఇంధన సరఫరా స్థిరంగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అయితే విమాన ఇంధనంపై పన్ను పెంపు కారణంగా విమానయాన రంగంపై కొంత ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అమల్లోకి వచ్చిన కొత్త సుంకాలు వచ్చే 15 రోజుల పాటు కొనసాగనున్నాయి.

# పీఎఫ్ సొమ్ము వెనక్కి తీసుకోలేరు: హైకోర్టు

హైదరాబాద్, జూన్ 16 : ఉద్యోగికి చట్టబద్ధంగా చెల్లించిన భవిష్యనిధి సొమ్మును తిరిగి వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. నిబంధనల ఉల్లంఘన జరిగితే దానికి బాధ్యత యాజమాన్యం లేదా సంబంధిత ట్రస్ట్‌పైనే ఉంటుందని, ఉద్యోగిపై కాదని తేల్చిచెప్పింది. జెవి నృపేందర్‌రావు అనే ఉద్యోగికి సంబంధించిన కేసును విచారించిన న్యాయస్థానం ఈ కీలక తీర్పు వెలువరించింది. ఆయన పనిచేసిన సంస్థకు సొంత భవిష్యనిధి ట్రస్ట్ ఉండగా, 2023లో మినహాయింపు హోదాను సంస్థ రద్దు చేసుకుంది. అనంతరం ఉద్యోగికి రూ. 2.50 కోట్ల భవిష్యనిధి సొమ్ము చెల్లించింది. అయితే మినహాయింపు హోదా రద్దైన తర్వాత నేరుగా చెల్లింపులు జరపడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ ఉద్యోగి నుంచి ఆ మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఈపీఎఫ్‌వో రికవరీ నోటీసులు జారీ చేసింది. దీనిపై ఉద్యోగి హైకోర్టును ఆశ్రయించగా, విచారణ చేపట్టిన న్యాయస్థానం ఉద్యోగికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. భవిష్యనిధి సొమ్ము ఉద్యోగి హక్కు అని, అది చట్టబద్ధంగా అందుకున్న నిధి కాబట్టి తిరిగి చెల్లించాలని కోరడం సమంజసం కాదని పేర్కొంది. మినహాయింపు హోదా రద్దైన తర్వాత భవిష్యనిధి నిధులను ఈపీఎఫ్‌వోకు బదిలీ చేసే బాధ్యత పూర్తిగా సంస్థ యాజమాన్యం, ట్రస్ట్‌పైనే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏవైనా ఉల్లంఘనలు జరిగితే వాటిపై చర్యలు తీసుకునే అధికారం ఈపీఎఫ్‌వోకు ఉందని, కానీ ఉద్యోగిపై రికవరీ చర్యలు చేపట్టలేదని తేల్చింది. అలాగే రికవరీ నోటీసులు జారీ చేసే ముందు ఉద్యోగికి వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వకపోవడం, వ్యక్తిగత విచారణకు అవకాశం కల్పించకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కారణాలతో ఈపీఎఫ్‌వో జారీ చేసిన రికవరీ నోటీసులను రద్దు చేసింది. ఈ తీర్పుతో భవిష్యనిధి ఖాతాదారులకు ఊరట లభించగా, నిబంధనల ఉల్లంఘనలకు ఉద్యోగులను బాధ్యులను చేయలేమని హైకోర్టు స్పష్టమైన సందేశం ఇచ్చింది.






# బంగారం ధరలు తగ్గుముఖం

**హైదరాబాద్, జూన్ 16:** బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి స్వల్ప ఊరట లభించింది. మంగళవారం బంగారం ధరలు తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ. 160, 22 క్యారెట్ల బంగారంపై రూ. 150, 18 క్యారెట్ల బంగారంపై రూ. 120 మేర తగ్గుదల నమోదైంది. ఉదయం మార్కెట్ ముగింపు సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,51,370గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం రూ. 1,38,750కు, 18 క్యారెట్ల బంగారం రూ. 1,13,530కు లభిస్తోంది. తెలంగాణలో వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కడప, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం రూ. 1,51,370, 22 క్యారెట్ల బంగారం రూ. 1,38,750, 18 క్యారెట్ల బంగారం రూ. 1,13,530 వద్ద విక్రయమవుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నై, కోయంబత్తూరులో బంగారం ధరలు ఇతర నగరాలతో పోలిస్తే అధికంగా నమోదయ్యాయి. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 1,53,380, 22 క్యారెట్ల బంగారం రూ. 1,40,600 వద్ద కొనసాగుతోంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, వడోదరా నగరాల్లో హైదరాబాద్‌కు సమానంగా ధరలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల్లో స్వల్ప హెచ్చుతగ్గులు, డాలర్ మారకం విలువ ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో ధరలు మారుతున్నాయని బులియన్ వ్యాపారులు తెలిపారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిస్థితులను బట్టి బంగారం ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఐదేళ్లలోనే 219 శాతం లాభం

## బంగారం బాండ్ల పెట్టుబడిదారులకు కనకవర్షం

**న్యూఢిల్లీ, జూన్ 16:** సావరీన్ గోల్డ్ బాండ్ 2020-21 సిరీస్-3లో పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభాలు దక్కనున్నాయి. ఐదేళ్ల క్రితం గ్రాము బంగారంపై రూ. 4,627 పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు గ్రాముకు రూ. 14,774 చొప్పున చెల్లించనున్నట్లు భారతీయ రిజర్వు బ్యాంకు ప్రకటించింది. దీంతో పెట్టుబడిదారులు ఏకంగా 219 శాతానికి పైగా లాభం పొందనున్నారు. 2020 జూన్ 16న విడుదలైన ఈ బాండ్లలో ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడి పెట్టిన వారికి గ్రాముకు రూ. 4,627, ఇతర మార్గాల్లో కొనుగోలు చేసిన వారికి రూ. 4,677 ధర నిర్ణయించారు. ప్రస్తుతం ఐదేళ్ల లాక్-ఇన్ కాలం పూర్తవడంతో ముందస్తు ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గ్రాముకు రూ. 14,774 విమోచన ధరను నిర్ణయించింది. దీంతో గ్రాముపై రూ. 10,147 వరకు లాభం దక్కనుంది. ఉదాహరణకు అప్పట్లో రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు సుమారు రూ. 3.19 లక్షల వరకు విలువ లభించనుంది. దీనికి అదనంగా ఐదేళ్ల కాలంలో ప్రతి ఏడాది 2.5 శాతం చొప్పున వడ్డీ కూడా అందింది. దీంతో మొత్తం రాబడి మరింత పెరిగింది. సావరీన్ గోల్డ్ బాండ్లకు మొత్తం ఎనిమిదేళ్ల గడువు ఉంటుంది. అయితే ఐదేళ్లు పూర్తైన తర్వాత ముందస్తుగా నగదుగా మార్చుకునే అవకాశం ఉంటుంది. ఈ బాండ్ల విమోచన ధరను ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ ప్రకటించే 999 స్వచ్ఛత కలిగిన బంగారం ధరల సగటు ఆధారంగా ఆర్‌బీఐ నిర్ణయిస్తుంది. అయితే బాండ్లను ఇప్పుడు విక్రయించాలా లేదా ఎనిమిదేళ్ల మెచ్యూరిటీ వరకు కొనసాగించాలా అనేది పెట్టుబడిదారుల ఆర్థిక అవసరాలు, భవిష్యత్ బంగారం ధరలపై ఉన్న అంచనాలపై ఆధారపడి ఉంటుంది. బంగారం ధరలు మరింత పెరుగుతాయని భావించే వారు పెట్టుబడిని కొనసాగించవచ్చు. తక్షణ నిధుల అవసరం ఉన్నవారు ప్రస్తుతం లభిస్తున్న లాభాలను పొందే అవకాశం ఉంది. పన్ను నిబంధనల విషయంలో కూడా జాగ్రత్త అవసరం. ఎనిమిదేళ్ల పూర్తి గడువు అనంతరం బాండ్లను విక్రయిస్తే మూలధన లాభాల పన్ను మినహాయింపు లభిస్తుంది. అయితే ఐదేళ్ల తర్వాత ముందస్తుగా విక్రయిస్తే మూలధన లాభాలపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ద్వితీయ మార్కెట్‌లో కొనుగోలు చేసిన బాండ్లకు ఈ మినహాయింపు వర్తించదు. దీంతో పెట్టుబడిదారులు పన్నులు, నికర లాభాలను లెక్కించుకుని నిర్ణయం తీసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.





# భారత్ 'ఏ' జట్టులో అశోక్ శర్మకు అవకాశం

**కొలంబో, జూన్ 16:** శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో పాల్గొంటున్న భారత్ 'ఏ' జట్టుకు యువ పేసర్ అశోక్ శర్మ ఎంపికయ్యాడు. గాయంతో జట్టుకు దూరమైన యుధ్‌వీర్ సింగ్ స్థానంలో అతడిని చేర్చినట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రకటించింది. యుధ్‌వీర్ సింగ్‌కు కుడి భుజంలో అసౌకర్యం తలెత్తడంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బెంగళూరులోని అత్యుత్తమ శిక్షణ కేంద్రంలో పునరావాస చికిత్స పొందాలని వైద్య బృందం సూచించింది. దీంతో అతడు సిరీస్ నుంచి తప్పుకోగా, అతని స్థానాన్ని అశోక్ శర్మతో భర్తీ చేశారు. ముక్కోణపు సిరీస్‌లో భారత్ 'ఏ' జట్టు ఇప్పటికే అఫ్గానిస్థాన్, శ్రీలంక జట్ల చేతిలో పరాజయం పాలైంది. వరుస ఓటములతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జట్టులో ఈ మార్పు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలి కాలంలో అశోక్ శర్మ అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. దేశీయ టీ20 టోర్నీలో అత్యధిక వికెట్లు సాధించిన అతడు, గత ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి గుర్తింపు పొందాడు. ఆ టోర్నీలో ఆరు మ్యాచ్‌లు ఆడిన అశోక్, గంటకు 154.2 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరి క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షించాడు. భారత్ 'ఏ' జట్టు మిగిలిన మ్యాచ్‌ల్లో అశోక్ శర్మ సేవలు అందించనున్నాడు. యువ పేసర్ జట్టుకు బలంగా నిలుస్తాడని జట్టు యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



## 'టైమ్స్' అత్యంత ప్రభావశీలుల జాబితాలో

# స్మృతి మంధాన

**న్యూఢిల్లీ, జూన్ 16:** భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. ప్రపంచ ప్రఖ్యాత 'టైమ్స్' మ్యాగజైన్ విడుదల చేసిన 2026 సంవత్సరానికి సంబంధించిన 100 మంది అత్యంత ప్రభావశీల క్రీడా వ్యక్తుల జాబితాలో మంధానకు స్థానం లభించింది. ఈ జాబితాలో భారత్ నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. గత కొంతకాలంగా అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న మంధాన తన బ్యాటింగ్‌తో ఎన్నో రికార్డులను సొంతం చేసుకుంది. వ్యక్తిగత విజయాలతో పాటు భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నందుకే ఆమెను ఈ ప్రతిష్ఠాత్మక జాబితాకు ఎంపిక చేసినట్లు టైమ్స్ పేర్కొంది. అంతేకాకుండా "రికార్డులు మంధానకు దాసోహం అవుతున్నాయి" అంటూ ప్రత్యేకంగా ప్రశంసించింది. మహిళల క్రికెట్‌లో మంధాన ఎన్నో అరుదైన ఘనతలు సాధించింది. దేశవాళీ వన్డేల్లో డబుల్ సెంచరీ నమోదు చేసిన ఆమె, అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. అలాగే ఒకే ఏడాదిలో వన్డేల్లో వెయ్యికి పైగా పరుగులు చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా కూడా నిలిచింది. 2024 నుంచి నిలకడైన ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న ఆమెకు బీబీసీ ఇండియన్ స్పోర్ట్స్ ఉమెన్ అవార్డు కూడా లభించింది. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ మంధాన విజయవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించింది. ఆమె సారథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మహిళల ప్రీమియర్ లీగ్‌లో 2024, 2026 సంవత్సరాల్లో ఛాంపియన్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా క్రీడా రంగంలో విశేష ప్రభావం చూపిన క్రీడాకారులు, కోచ్‌లు, నిర్వాహకులు, పెట్టుబడిదారులు, మార్పును తీసుకొచ్చిన వ్యక్తులతో టైమ్స్ ఈ జాబితాను రూపొందించింది. ఇందులో ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనెల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో, టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్కరాస్, ఫిఫా అధ్యక్షుడు జియన్నీ ఇన్‌ఫాంటినో వంటి ప్రముఖులు చోటు దక్కించుకున్నారు. వారితో పాటు ఈ జాబితాలో నిలిచిన ఏకైక భారత క్రీడాకారిణిగా స్మృతి మంధాన మరో అరుదైన గౌరవాన్ని అందుకుంది.

# ఢిల్లీలో తొలిసారి ఫెన్సింగ్ ఆసియా కప్

## జూన్ 19 నుంచి పోటీలు

**న్యూఢిల్లీ, జూన్ 16:** వన్డే ప్రపంచకప్, టీ20 ప్రపంచకప్ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలకు విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిన భారత్.. ఇప్పుడు మరో అంతర్జాతీయ క్రీడా మహోత్సవానికి వేదిక కానుంది. ప్రతిష్ఠాత్మక ఫెన్సింగ్ ఆసియా కప్ పోటీలను జూన్ 19 నుంచి 24 వరకు ఢిల్లీలో నిర్వహించనున్నారు. ఫెన్సింగ్ ఆసియా కప్ టోర్నీ భారత రాజధానిలో జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఆసియా ఖండంతో పాటు మధ్య, దక్షిణ పసిఫిక్ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఫెన్సర్లు ఈ టోర్నీలో పాల్గొననున్నారు. ఫెన్సింగ్ క్రీడలో అత్యంత ప్రతిష్ఠాత్మక వార్షిక పోటీలలో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ టోర్నీపై క్రీడాభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈసారి పోటీలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే క్రీడాకారులకు ఆసియా క్రీడల్లో పాల్గొనే అవకాశాలు లభించనున్నాయి. అలాగే పోటీల ఆధారంగా అంతర్జాతీయ ర్యాంకింగ్ పాయింట్లు కూడా కేటాయించనున్నారు. ఇవి 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ అర్హత ప్రక్రియలో కీలకంగా మారనున్నాయి. టోర్నీ సందర్భంగా ఆసియా ఫెన్సింగ్ సమాఖ్య 39వ సాధారణ సమావేశాన్ని కూడా ఢిల్లీలో నిర్వహించనున్నారు. దీంతో ఆసియా ఫెన్సింగ్ ప్రపంచం మొత్తం భారత వైపు దృష్టి సారించింది. భారత ఫెన్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజీవ్ మెహతా మాట్లాడుతూ, "దేశంలో తొలిసారి సీనియర్ స్థాయి ఆసియా ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం భారత క్రీడా చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయి. ప్రపంచ స్థాయి ఫెన్సర్లను ఆహ్వానించడంతో పాటు 2028 ఒలింపిక్స్ సన్నాహకాలకు ఇది మంచి వేదికగా నిలుస్తుంది. ఈసారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వీడియో రిఫరల్ వ్యవస్థను కూడా వినియోగిస్తున్నాం" అని తెలిపారు. ఈ టోర్నీలో భారత ఒలింపియన్ భవానీ దేవితో పాటు మొత్తం 24 మంది భారత ఫెన్సర్లు బరిలోకి దిగనున్నారు. స్వదేశంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో భారత క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




# తన పేరుతో నకిలీ సోషల్ మీడియా పేజీ



## పోలీసులకు ఫిర్యాదు చేసిన సౌరవ్ గంగూలీ

కోల్‌కతా, జూన్ 16 : భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తన పేరుతో నడుస్తున్న నకిలీ సోషల్ మీడియా ఖాతాలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు ఎలాంటి సంబంధం లేకుండా కొందరు వ్యక్తులు ఫేస్‌బుక్ పేజీలను నిర్వహిస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా పోస్టులు చేస్తున్నారని ఆరోపించారు. 'సౌరవ్ గంగూలీ ఫ్యాన్స్' పేరుతో నడుస్తున్న ఫేస్‌బుక్ పేజీలో తన అభిప్రాయాలుగా తప్పుడు విషయాలను ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే 'స్పోర్ట్స్‌వికీ' పేరుతో ఉన్న మరో సామాజిక మాధ్యమ వేదికపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు కోల్‌కతాలోని ఠాకుర్‌పుకుర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన గంగూలీ, తన గౌరవం, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరంతరం తప్పుడు ప్రచారం జరుగుతోందని ఫిర్యాదులో వివరించారు. తాను ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి కావడంతో ఇలాంటి తప్పుడు ప్రచారం వల్ల ప్రజల్లో తనపై ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. అసత్య సమాచారం, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు, పరువు నష్టం కలిగించే విషయాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నకిలీ పేజీలను నిర్వహిస్తున్న వారిని గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని గంగూలీ పోలీసులను కోరారు. ప్రస్తుతం ఈ ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

# మ్యాచ్ కాగానే వెళ్లిపోమన్న అమెరికా

## ఇరాన్ ఆగ్రహం

**లాస్ ఏంజెల్స్, జూన్ 16 :** ప్రపంచ ఫుట్‌బాల్ మహాసంగ్రామంలో పాల్గొంటున్న ఇరాన్ జట్టుకు అమెరికా అధికారులు ఇచ్చిన ఆదేశాలు వివాదానికి దారితీశాయి. న్యూజిలాండ్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌ను డ్రాగా ముగించుకున్న అనంతరం వెంటనే అమెరికా భూభాగాన్ని విడిచి వెళ్లాలని ఇరాన్ జట్టుకు సూచించడంతో ఆ దేశ కోచ్ అమీర్ ఘలెనోయి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టోర్నీలో పాల్గొనే జట్టుగా తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ఇప్పుడు మ్యాచ్ పూర్తికాగానే దేశం విడిచి వెళ్లాలనే ఆదేశం మరింత బాధ కలిగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్ జట్టు లాస్ ఏంజెల్స్‌లో కొంతకాలం ఉండి తదుపరి మ్యాచ్‌కు సిద్ధం కావాలని భావించినప్పటికీ, అమెరికా అధికారులు వారిని వెంటనే మెక్సికోలోని టిజువానా శిక్షణ కేంద్రానికి వెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంపై స్పందించిన ఘలెనోయి, టోర్నీ ప్రారంభం నుంచే తమ జట్టు వివిధ అవరోధాలను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. వీసా సమస్యలు, ప్రయాణ ఇబ్బందులు, పరిపాలనా పరమైన ఆటంకాల కారణంగా తమ సహాయక సిబ్బంది, ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు, ఇతర ప్రతినిధులు అమెరికాకు రాలేకపోయారని తెలిపారు. ప్రపంచ వేదికపై తమకు ఎదురవుతున్న సమస్యలను వివరించడానికి సరైన ప్రతినిధులు కూడా తమతో లేరని ఆయన వాపోయారు. తమ దేశ మీడియా, సమాఖ్య ప్రతినిధులు లేకపోవడం వల్ల తమ పరిస్థితిని ప్రపంచానికి తెలియజేయడం కూడా కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న టోర్నీలో అత్యధిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జట్టు తమదేనని ఘలెనోయి వ్యాఖ్యానించారు. ఇరాన్ జట్టు కెప్టెన్ మెహ్దీ తరేమీ, మధ్యమైదాన ఆటగాడు మొహమ్మద్ మొహెబీ కూడా అమెరికా అధికారుల నిర్ణయాన్ని తప్పుబట్టారు. క్రీడలను రాజకీయ అంశాలకు దూరంగా ఉంచాలని వారు అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య తమకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, న్యూజిలాండ్‌తో తొలి పోరులో సమంగా నిలిచిన ఇరాన్ జట్టు తదుపరి మ్యాచ్‌లో బెల్జియంను ఎదుర్కోనుంది. జూన్ 22న జరగనున్న ఈ పోరు ఇరాన్‌కు అత్యంత కీలకంగా మారింది. తదుపరి దశకు చేరుకోవాలంటే ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం తప్పనిసరి కావడంతో జట్టు మొత్తం దానిపైనే దృష్టి కేంద్రీకరించింది. ప్రస్తుతం మైదానం వెలుపల నెలకొన్న వివాదాలు జట్టు ప్రదర్శనపై ఎలాంటి ప్రభావం చూపకుండా ఉండాలని ఇరాన్ అభిమానులు కోరుకుంటున్నారు.



# లంక ఆటగాడితో వైభవ్ గొడవ.. ఐసీసీ చర్యలు తప్పవా?

కొలంబో, జూన్ 16 : శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ, శ్రీలంక-ఏ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ప్రవర్తన చర్చనీయాంశంగా మారింది. సూపర్ ఓవర్‌లో భారత్-ఏ ఓటమి పాలైన తర్వాత మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, ఈ సందర్భంగా వైభవ్ సూర్యవంశీ శ్రీలంక ఆటగాడు విషేన్ హాలంబగేతో ఘర్షణకు దిగినట్లు సమాచారం. మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగి ఇరు జట్లు 265 పరుగుల వద్ద సమంగా నిలవడంతో ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించారు. ఇందులో శ్రీలంక-ఏ విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన అనంతరం ఆటగాళ్లు మైదానం వీడుతున్న సమయంలో ఇరు జట్ల మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో సహనం కోల్పోయిన వైభవ్ ప్రత్యర్థి ఆటగాడిని తోసేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అక్కడే ఉన్న సీనియర్ ఆటగాడు నిరోషన్ డిక్వెల్లా జోక్యం చేసుకుని ఇరువురిని విడదీయడంతో గొడవ మరింత పెద్దది కాకుండా ఆగిపోయింది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ 14 బంతుల్లో 21 పరుగులు చేసి ఆకట్టుకున్నప్పటికీ, అనంతరం జరిగిన ఘటన అతనిపై విమర్శలకు దారితీసింది. శ్రీలంక ఆటగాళ్ల సంబరాలు లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలే ఈ వివాదానికి కారణమై ఉండవచ్చని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. మైదానంలో ఆటగాళ్ల మధ్య భౌతిక ఘర్షణలను అంతర్జాతీయ క్రికెట్ మండలి తీవ్రంగా పరిగణిస్తుంది. ఐసీసీ ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రత్యర్థి ఆటగాడితో అనుచిత శారీరక సంబంధం లెవల్-1 నేరంగా పరిగణించే అవకాశం ఉంది. దీనికింద జరిమానా, హెచ్చరిక లేదా డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశముంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను మ్యాచ్ రిఫరీ పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. మ్యాచ్ సందర్భంగా వెలుతురు సమస్య, సూపర్ ఓవర్ నిర్వహణపై కూడా వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆటగాళ్లలో ఉద్రిక్తత పెరిగినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరు జట్ల సహాయక సిబ్బంది జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దగా, ఆటగాళ్లు పరస్పరం కరచాలనం చేసుకుని మైదానం వీడారు. ఈ ఘటనపై ఇప్పటివరకు బీసీసీఐ అధికారికంగా స్పందించలేదు.

చురకలు





# ఓటీటీలోకి కాజల్..

## ‘విశాఖ’లో లేడీ డాన్‌గా అలరింపు

దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా కొనసాగుతున్న కాజల్ అగర్వాల్ ఇప్పుడు తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. కథకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ సెకండ్ ఇన్నింగ్స్‌లో ముందుకు సాగుతున్న ఆమె, తొలిసారిగా ఓటీటీ ప్రపంచంలో అడుగుపెట్టబోతోంది. ‘స్వామి రారా’ చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు సుధీర్ వర్మ తెరకెక్కిస్తున్న ‘విశాఖ’ వెబ్ సిరీస్‌లో కాజల్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సిరీస్‌పై సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ సిరీస్‌లో కాజల్ పాత్ర కథకు ప్రధాన బలంగా నిలవనుందని సమాచారం. సాధారణ గృహిణిగా కనిపించే ఆమె, పరిస్థితుల కారణంగా అండర్‌వల్డ్‌ను శాసించే శక్తివంతమైన మహిళగా మారే పాత్రలో కనిపించనుందని తెలుస్తోంది. అమాయకత్వం, భావోద్వేగం, ఆవేశం, నాయకత్వ లక్షణాలను ఒకే పాత్రలో ఆవిష్కరించే అవకాశం కాజల్‌కు దక్కినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్ సన్నివేశాలకు కూడా ఈ సిరీస్‌లో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా లేడీ డాన్ అవతారంలో కాజల్ కనిపించే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించినట్లు తెలుస్తోంది. ఆమె కెరీర్‌లో ఇప్పటివరకు కనిపించని స్థాయిలో యాక్షన్ ప్రదర్శన ఈ సిరీస్‌లో ఉండబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సినీ పరిశ్రమలో వినిపిస్తున్న కథనాల ప్రకారం, ఈ సిరీస్‌కు మహిళా ప్రధాన కథాంశంతో రూపొందిన ప్రముఖ హిందీ వెబ్ సిరీస్‌ల తరహాలో శక్తివంతమైన కథనం ఉండనుంది. అయితే కథ, పాత్రలు, సంఘటనలు పూర్తిగా కొత్తగా ఉండేలా దర్శకుడు సుధీర్ వర్మ రూపొందించినట్లు సమాచారం. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్న ‘విశాఖ’ వెబ్ సిరీస్ జూలై లేదా ఆగస్టు నెలలో ఓటీటీ వేదికగా విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అధికారిక విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశముంది. ఇదిలా ఉండగా, కాజల్ అగర్వాల్ సినిమాల పరంగానూ బిజీగా కొనసాగుతున్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తున్నారు. వెబ్ సిరీస్‌లు, సినిమాలు రెండింటిలోనూ బలమైన పాత్రలను ఎంచుకుంటూ కాజల్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను మరింత విజయవంతంగా కొనసాగిస్తున్నారు.



# నివేదా థామస్ ఇప్పుడు ఎక్కడుంది?

తెలుగు సినీ పరిశ్రమలో కొన్ని సినిమాలతోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని అభిమానుల మనసుల్లో స్థానం సంపాదించిన హీరోయిన్లలో నివేదా థామస్ ఒకరు. తక్కువ సినిమాలే చేసినప్పటికీ తన సహజమైన నటన, పక్కింటి అమ్మాయి తరహా అందంతో ప్రేక్షకులకు ఎంతో చేరువయ్యారు. కేరళలో జన్మించిన నివేదా థామస్ బాలనటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. మలయాళ చిత్రాలతో పాటు పలు టెలివిజన్ కార్యక్రమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం కథానాయికగా మారి తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో తన ప్రతిభను చాటుకున్నారు. తెలుగులో నాని హీరోగా తెరకెక్కిన ‘జెంటిల్‌మన్’ సినిమాతో కథానాయికగా పరిచయమైన నివేదా, తొలి చిత్రంతోనే ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత ‘నిన్ను కోరి’, ‘జై లవకుశ’, ‘118’, ‘బ్రోచేవారెవరురా’, ‘వకీల్ సాబ్’ వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ముఖ్యంగా ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్ వంటి అగ్ర హీరోల సరసన నటించి మరింత క్రేజ్ పొందారు. ఇటీవల ‘35 చిన్న కథ కాదు’ చిత్రంలో తల్లి పాత్రలో కనిపించి మరోసారి తన నటనా ప్రతిభను నిరూపించారు. హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ చిత్రంలో ఆమె నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. ప్రస్తుతం నివేదా థామస్ కొత్త అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఆమె తరచూ తన వ్యక్తిగత, వృత్తి జీవితానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆమె పంచుకున్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



# సూర్యతో నెల్సన్ ప్లాన్

నటుడు సూర్య 50వ చిత్రానికి ’జైలర్’ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారా? అనేది కోలీవుడ్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం నెల్సన్, రజనీకాంత్‌తో ’జైలర్ 2’ పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే ’సూర్య 50’ కోసం వీరిద్దరూ కలిసి పని చేయనున్నట్లు సమాచారం. ఈ మైలురాయి చిత్రాన్ని ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తీయాలని ప్లాన్. ఈ ప్రాజెక్ట్‌ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించే అవకాశం ఉందని, దీనికి అనిరుధ్ సంగీతం అందిస్తారని టాక్. నెల్సన్ కామెడీ స్టైల్‌కి, సూర్య ఎనర్జీ తోడైతే థియేటర్లలో నవ్వులే నవ్వులని ఫ్యాన్స్ అంచనా. నెల్సన్ ప్రస్తుతం ’జైలర్ 2’ ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉన్నారు. దీంతో ’సూర్య 50’ సెట్స్ పైకి వెళ్లేందుకు ఇంకా టైమ్ పడుతుంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. నెల్సన్-సూర్య కాంబో కుదిరితే తెలుగు, తమిళ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొంటాయి.

# సింగీతం ప్రతిభకు ఎన్టీఆర్ ప్రశంసలు

ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన తాజా చిత్రం ‘సింగ్ గీతం’ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటుండగా, తాజాగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ చేసిన వ్యాఖ్యలు చిత్రంపై మరింత ఆసక్తిని పెంచాయి. సినిమాను వీక్షించిన అనంతరం ఎన్టీఆర్ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు.



ఈ చిత్రం తన హృదయాన్ని హత్తుకుందని పేర్కొంటూ, 94 ఏళ్ల వయసులోనూ సింగీతం శ్రీనివాసరావు చూపించిన సృజనాత్మకత, కథల పట్ల ఆయనకున్న అంకితభావం తనను ఆశ్చర్యపరిచిందని తెలిపారు. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని, ప్రతిభకు వయసుతో సంబంధం లేదని ఈ సినిమా మరోసారి నిరూపించిందన్నారు. చిత్రాన్ని నిర్మించిన నాగ్ అశ్విన్‌ను ప్రత్యేకంగా అభినందించిన ఎన్టీఆర్, నాలుగు దశాబ్దాలుగా సింగీతం మనసులో ఉన్న కలను తెరపైకి తీసుకురావడం గొప్ప విషయమని కొనియాడారు. ఒక లెజెండ్ కలను సాకారం చేయడం అరుదైన ఘనత అని పేర్కొన్నారు. సింగీతం శ్రీనివాసరావుకు ఈ చిత్రం అందమైన నివాళిగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ పనితీరుపైనా ఎన్టీఆర్ ప్రశంసలు కురిపించారు. ఆయన అందించిన సంగీతం సినిమాలోని ప్రతి భావోద్వేగాన్ని ప్రేక్షకులకు చేరవేసిందని, కథను మరింత బలంగా నిలబెట్టిందని చెప్పారు. ప్రతి సన్నివేశంలో సంగీతం ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. అలాగే సినిమా ప్రచారంలో చిత్రబృందం అనుసరించిన వినూత్న విధానం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని



ఎన్టీఆర్ తెలిపారు. సాధారణంగా సినిమా విడుదలకు ముందే ట్రైలర్ విడుదల చేస్తారని, అయితే ‘సింగ్ గీతం’ విషయంలో సినిమా విడుదలైన తర్వాత ట్రైలర్ విడుదల చేయడం ఆసక్తికరంగా అనిపించిందన్నారు. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్న ఎన్టీఆర్, ప్రేక్షకులు తప్పకుండా థియేటర్లలో ఈ చిత్రాన్ని వీక్షించాలని సూచించారు. సింగీతం శ్రీనివాసరావు సృజనాత్మకతకు, నాగ్ అశ్విన్ సంకల్పానికి, దేవిశ్రీ ప్రసాద్ సంగీతానికి ఈ చిత్రం నిదర్శనంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# సినిమాలకు దూరమైన స్టార్ హీరోయిన్..



ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన సదా ప్రస్తుతం పూర్తిగా భిన్నమైన జీవితాన్ని గడుపుతున్నారు. అందం, అమాయకత్వం, సహజ నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ఆమె ఇప్పుడు వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్‌గా ప్రకృతికి దగ్గరగా జీవిస్తున్నారు. నితిన్ హీరోగా తెరకెక్కిన ‘జయం’ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన సదా తొలి సినిమాతోనే ఘన విజయాన్ని అందుకున్నారు. అనంతరం ‘అపరిచితుడు’ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించారు. ఆ తర్వాత ఎన్టీఆర్, బాలకృష్ణ, ఉదయ్ కిరణ్, నితిన్ తదితర స్టార్ హీరోల సరసన నటిస్తూ వరుస అవకాశాలు అందుకున్నారు. కొంతకాలం పాటు తెలుగు, తమిళ భాషల్లో అగ్ర కథానాయికగా కొనసాగిన సదా నటించిన కొన్ని చిత్రాలు ఆశించిన విజయాలు సాధించకపోవడంతో క్రమంగా అవకాశాలు తగ్గాయి. దీంతో ఆమె సినీ రంగానికి దూరమయ్యారు. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే సదా అసలు పేరు సదాఫ్ మొహమ్మద్ సయీద్. మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో ముస్లిం కుటుంబంలో జన్మించిన ఆమె తర్వాత సినీ రంగంలో ‘సదా’ పేరుతో గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆమె వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. అడవుల్లోని జంతువులు, పక్షులు, ప్రకృతి అందాలను తన కెమెరాలో బంధిస్తూ ప్రశాంతమైన జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. తాను తీసిన అరుదైన చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ ప్రకృతి ప్రేమికుల ప్రశంసలు అందుకుంటున్నారు. అలాగే బుల్లితెర కార్యక్రమాల్లో అప్పుడప్పుడూ కనిపిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండే సదా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన చిత్రాలు, ప్రకృతి దృశ్యాలను అభిమానులతో పంచుకుంటుంటారు. ఇక సదా మళ్లీ సినిమాల్లోకి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి మరోసారి వెండితెరపై సందడి చేస్తారేమోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com